ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఫిబ్రవరి 24, 2019

# సైన్సులో మన ముద్రేది..?

# మంచు ఆటలో మనోడు

మన దేశంలో హిమాలయాలు, మంచు కురిసే ప్రాంతాలు ఉన్నా, మంచులో నిర్వహించే ఆటలకు అంతగా ప్రాధాన్యం లేదు. పాశ్చాత్య దేశాల్లో ఆడే స్కీయింగ్ ఆట గురించి మన దేశంలో చాలామందికి తెలియదు. కానీ, ఎవరి ప్రోత్సాహం లేకపోయినా ఈ ఆట పట్ల మక్కువతో ఒలింపిక్ గేమ్స్ వరకు చేరుకుని మూడుసార్లు దేశం తరపున ఆడిన భారతీయుడు.... ఆరిఫ్

★ కాలికి స్కీను ధరించి స్టిక్ సాయంతో మంచులోయలో వేగంగా ప్రయాణించే ఆటను స్కీయింగ్ అంటారు. కాశ్మీర్ లోయ ప్రాంతాలకు సందర్శకులు అనేకమంది వస్తుంటారు. ఆరిఫ్ తండ్రి యాసిన్ గుల్మార్గ్‌లో ఈ ఆట పరికరాలను అమ్ముతూ జీవనం సాగించేవాడు. వాటితో తన నాలుగో ఏట నుంచే ఈ ఆటను ఆడడం మొదలుపెట్టాడు.

★ 15 ఏళ్లు వచ్చేసరికి జూనియర్ నేషనల్ చాంపియన్‌గా, 16వ ఏట ఆసియా క్రీడల్లో టాప్ 15 మందిలో ఒకడిగా నిలిచాడు. అథ్లెట్‌గా కూడా ఎన్నో పతకాలు సొంతం చేసుకున్నాడు. కానీ, గుర్తింపు కరువైనా దేశం కోసం ఆడాలన్న తపన ఈ పోటీల్లో నిలిపింది.

★ 2011 ఆసియా క్రీడల్లో గెలుపుతో గుర్తింపు లభించింది. 2015 కొలరాడో ఆల్పైన్ స్కీయింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆడే అవకాశం దక్కింది. ప్రభుత్వ ఫండ్స్‌గానీ, స్పాన్సర్‌షిప్‌లు గానీ లేకుండానే, తల్లిదండ్రుల తోడ్పాటుతోనే నేషనల్ స్థాయికి చేరుకున్నాడు.

★ అసలే చలి, అదీ శీతలప్రాంతం. పొద్దునే లేచి మంచును సరిచేసుకోవడం, ప్రాక్టీస్ చేయడం, తిరిగి స్కూల్‌కి వెళ్లడం... ఈ ప్రాంతంలో ప్రాక్టీస్ అంత సరిగా కుదరకపోయినా ఎంతో కష్టపడేవాడు. తనకు శిక్షణ ఇచ్చేందుకు ఇటలీ కోచ్ ముందుకొచ్చినా అక్కడికి వెళ్లేందుకు రూ.70 లక్షల ఖర్చు అవుతుంది. కానీ, తన తండ్రికి అంత స్థోమత లేదు. ఇలా తన కష్టాన్ని చూసిన ఓ కంపెనీ వారు రూ.10 లక్షల ఫండ్ సేకరించి తనకు సహాయం చేశారు.

★ ప్రస్తుతం 2022 బీజింగ్‌లో జరగనున్న వింటర్ ఒలింపిక్ గేమ్స్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నాడు.

# సైబోర్గ్ సంచలనం..!

సైబోర్గ్ కథాంశంతో ఎన్నో చిత్రాలు వచ్చాయి. వాటిలో టెర్మినేటర్ సిరీస్ బాగా హిట్టయ్యింది. ఇప్పుడు దానికి ఆరో సార్ట్ రాబోతోంది. ఈమధ్యే చిత్రీకరించిన 'అలిటా' కూడా ఇలాంటి కథాంశమే. రోబోకాప్‌కు దగ్గరగా ఉన్నా ఇది మరింత భావోద్వేగాలతో కూడినదని అంటున్నారు.

జేమ్స్ కామెరూన్ నిర్మాణంలో వచ్చిన అద్భుతమైన చిత్రాలు టైటానిక్, అవతార్ రికార్డులు సృష్టించాయి. నూతనంగా సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో 'అలిటా-బాటిల్ ఏంజెల్', టెర్మినేటర్-6 ఆయన నిర్మాణ సారథ్యంలో వస్తున్నాయి. సైబోర్గ్‌ల చుట్టూ తిరిగే అలిటా చిత్రం రాబర్ట్‌రోడ్రిజ్ దర్శకత్వంలో వచ్చింది. దీనిలో అలిటాకు టీనేజీ అమ్మాయి బ్రెయిన్ అమర్చడంతో ప్రేమ, కోపం, బాధ అనే భావోద్వేగాలతో కూడిన సైబోర్గ్‌గా మారుతుంది. ఇదే మిగతా సినిమాలతో వేరు చేసే అంశం. ఆర్నాల్డ్ సిరీస్ మూవీ 'టెర్మినేటర్-6' ద్వారా కిల్లర్ మెషీన్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. వీటితో పాటు అమెరికన్ సూపర్‌స్టార్ విల్‌స్మిత్ నటించిన జెమినీమాన్, ఆడ్‌అస్ట్రా, క్యాపిటివ్ స్టేట్, రెప్‌లికాస్, సిన్‌క్రోనిక్, సూపర్ ఇంటెలిజెన్స్ వంటివి సైన్సు ఫిక్షన్‌తో రానున్న హాలీవుడ్ సినిమాలు.

అట్టమీద కథ ........6
సైన్సులో మన ముద్రేది..?





ఎర్ర గులాబీ ... 2
ఇదీ జీవితం

ఓ స్వేచ్ఛా స్వరం ... 5
స్ఫూర్తి

మంచు నగరం... 11
యమహా నగరీ

దుఃఖపు రంగు... 14
కథ

దూరదృష్టి ... 17
బాలల కథ

పొద్దుతిరుగుడు పువ్వు... 18
సైన్స్ కథ

పోరాటమే జీవితం ... 24
సుచిత్రం

విహారం... 12
తెల్లని మబ్బుల లోగిళ్లు...

## సులభంగా సురక్షిత నీరు

తాగటానికి వీలైన మంచినీరు దొరకటమే మానవాళికి ఇప్పుడు ప్రముఖమైన అవసరం. ప్రకృతి వనరులు నానాటికీ కాలుష్య బారిన పడుతున్న తరుణంలో మంచి నీటి లభ్యత కూడా తగ్గిపోతోంది. నీటిని శుద్ధి చేసి వాడడం తప్పనిసరి అయింది. ఆక్రమంలో కూడా పర్యావరణానికి హాని లేని సులభ పద్ధతిని ఇటీవల బీజింగ్‌లోని చైనీస్ అకాడమీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రాసెస్ ఇంజినీరింగ్ (IPE), జియాంగ్షులోని యాంగ్షూ విశ్వవిద్యాలయం (YZU) శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇప్పటివరకూ నీటి శుద్ధికి అతి నీలలోహిత కాంతి, క్లోరినేషన్, ఓజోన్ విలీనం వంటి పద్ధతులు అవలంబిస్తున్నారు. ఈ శాస్త్రజ్ఞులు అంతకన్నా సులభ పద్ధతి కనుగొన్నారు. గ్రాఫికల్ కార్బన్ నైట్రేట్ గల లోహాన్ని వినియోగించి మురికినీటిని శుద్ధి చేశారు. ఈ ప్రక్రియలో ఈకోలి వంటి వ్యాధికారక సూక్ష్మజీవులు ఉన్న చెత్తనీటిని 30 నిమిషాల్లో 99.9999 శాతం పరిశుద్ధం చేసింది. ఈ పద్ధతిని మెరుగుపరిస్తే- మరింత సులభంగా సురక్షిత నీటిని పొందే అవకాశం ఉంది.

అందని మిన్నే
ఆనందం అందే మన్నే
ఆనందం
అరె భూమిని చీల్చుకు పుట్టే
పచ్చని పసిరిక ఆనందం
మంచుకి ఎండే ఆనందం
వాగుకి వానే ఆనందం
అరె ఎండకి వానకి రంగులు మారే ప్రకృతి ఆనందం
బ్రతుకే నూరేళ్లందం బ్రతుకే బ్రహ్మానందం
చెలియా వయసుడిగే స్వగతంలో
అనుబంధం ఆనందమానందం
పచ్చని చిలుకలు తోడుంటే
పాడే కోయిల వెంటుంటే
భూలోకమే ఆనందానికి ఇల్లు
ఈ లోకంలో కన్నీరింకా చెల్లు

గీతం : పచ్చని చిలుకలు తోడుంటే
చిత్రం : భారతీయుడు
రచన : భువన చంద్ర

సరైన ప్రశ్నలను అడిగితే ప్రకృతి తన రహస్యాలను తెలిపే తలుపులను తెరుస్తుంది.

- సి.వి.రామన్

విద్యావేత్తలు విద్యార్థులలో విచారణ, సృజనాత్మకత, వ్యవస్థాపక, నైతిక, నాయకత్వ స్ఫూర్తిని పెంపొందించాలి.. వారికి ఆదర్శంగా నిలవాలి.

- మౌలానా అబుల్ కలాం ఆజాద్

క్లిష్టమైన భౌతిక రసాయన శాస్త్ర దృగ్విషయాలను చాలా సున్నితంగా, సరళంగా, సైన్సు కథలుగా చెప్పటం బాగుంది. రచయితకు అభినందనలు. ఇటువంటి రచనలకు ప్రోత్సహిస్తున్న ప్రజాశక్తికి ప్రత్యేక ధన్యవాదాలు.

- నాగేశ్వరరావు, పట్నాల

అట్టమీదికథగా కమ్మనైన అమ్మభాష... తెలుగు గురించి తేటతెల్లంగా విశదపరిచారు. 'ఒకే విత్తనం మూడు మొలకలు' కథాకర్తకి అభినందనలు. యూవీ యువతి... చిత్రాలు మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి. 'ఆరుకప్పల ఆట' ఉదంతం కొత్తక్రీడా విశేషాన్ని పరిచయం చేసినట్టయింది.

- నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం

'స్నేహ' చాలా ఆకర్షణీయంగా ఉంది. 'కమ్మనైన అమ్మభాష..' కకవర్‌పేజి కథనం ఆసక్తిదాయకంగా ఉంది. కవిత్వమ్ శీర్షికలో వారం వారం ప్రచురిస్తున్న కవితలు చాలా బాగుంటున్నాయి.

- ఎల్. ప్రఫుల్ల చంద్ర, ధర్మవరం

## మన బామ్మల బామ్మ గారి పుర్రె

మానవుడి అతి ప్రాచీన రూపమైన 'లిటిల్ ఫుట్' అనే అస్థిపంజరాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది 3.67 మిలియన్ల సంవత్సరాల క్రితం నాటిదని గుర్తించారు. 1994లో దక్షిణాఫ్రికాలో ఓ గుహలో కొనుగొన్న ఈ పుర్రె భాగం ఆడజీవిగా నిర్ధారించారు. ఇది మానవ పరిణామానికి ముందు చింపాంజీలా నడిచే సమూహానికి సంబంధించినది. ఈ లిటిల్ ఫుట్ అంతర్గత చెవి నిర్మాణం ప్రారంభంలో ఉండే హొమోనిన్ జాతులకు భిన్నంగా ఉందని గుర్తించారు. ఈ విషయాన్ని అలీలీ బ్యూడెట్ స్కూల్ ఆఫ్ జియోగ్రఫీ, ఆర్కియాలజీ అండ్ ఎన్విరాన్మెంట్‌లో స్టడీస్ పరిశోధకుడు, దక్షిణాఫ్రికాలోని విట్‌వాటర్స్‌రాండ్ (Witwatersrand) విశ్వవిద్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. 17 ప్రారంభపు మానవుని పుర్రెల నమూనాలు, పది మనుగడలో ఉన్న మానవుని, చింపాజీల పుర్రె నమూనాలతో పోల్చి పరిశోధించారు.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా : స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం : 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

# ఎర్ర గులాబీ

- కేఆర్టీ
98495 68901

ఇదీ జీవితం

డిసెంబరు చలి మంచుతో మరింత ముదురుతుంది. పక్షుల సందడి అంతగా లేదు.

చలికి మునగదీసుకుని చెట్ల కొమ్మల్లో చిరు నిద్రలో జోగుతున్నాయి. అప్పుడప్పుడు ఆకులు ఉదయ రాగాలు తీసేందుకు గొంతులు సవరించుకుంటున్నాయి.

మంచు దుప్పట్లోంచి బద్ధకంగా సూర్యుడు తొంగిచూస్తున్నాడు. 'అప్పుడే తెల్లారిందా' పెళ్లాం పనుల సందడి వింటూ దుప్పటి ముసుగులోంచే ప్రశ్నించాడు అప్పడు. 'నువ్వు తొంగో. నీకప్పుడే తెల్లారదుగదా! నాకెప్పుడో తెల్లారింది.' అంటూ గులాబీలు లెక్కిస్తూ చిన్నచిన్న కవర్లలోకి సర్దుతోంది అరుణ.

పెళ్లాం మాటలు గట్టిగానే గుచ్చుకున్నాయి. కానీ దులిపేసుకున్నాడు. అప్పడిది బద్ధకంతో విడదీయరాని బంధం. ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకుంటారు. ఆ మాటకొస్తే పెళ్లానికన్నా బద్ధకాన్నే ఎక్కువ ప్రేమిస్తాడు అప్పడు. పెళ్లాం పనిని ప్రేమిస్తుంది. బద్ధకానికి అరుణ అంటే భయం. దరిదాపులకి సైతం వెళ్లదు. కోడిని నిద్రలేపేంత ముందుగా మంచం దిగుతుంది అరుణ.

గులాబీలన్నీ కవర్లలోకి సర్దటం పూర్తయ్యాక వాటిని మేదరి తట్టలో పెట్టింది. చకచకా ఇంటి పనులు పూర్తి చేసుకుంది. మొగుడికి టీ కాచి ఒక స్టీలు గ్లాసులో పోసింది.

'ఏమయ్య టీ తాగు' అంది మంచం దగ్గరికి తీసుకెళ్లి. ముసుగు తీసి మంచం మీద బాసింపట్టి వేసుక్కూచున్నాడు. అప్పడు పొగలు చిమ్ముతున్న గ్లాసు అందుకున్నాడు. 'చాలా చాలా టాంక్సే పెళ్లామా' అన్నాడు టీని పెదాల మధ్య నుంచి పీలుస్తూ. 'సడేలే సంబడం' మూతి మూడు వంకర్లు తిప్పి మరో గ్లాసులోకి టీ పోసుకుంది. చతికిల పడి తెరిచిన గుమ్మంలోంచి వీధిలోకి చూస్తూ కొద్ది కొద్దిగా చప్పరించసాగింది.

అప్పటికి మంచు కాస్త పలచబడింది. వెలుతురు పెరిగింది. అరుణ మనసు గతంలోకి పరుగెత్తింది.

•••

ఆటలు పాటలు లోకంగా గడిచిపోయిన బాల్యం తలచినప్పడల్లా తియ్యని బాధతో మనసు మూలుగుతుంది. బాల్యంలోనే బతుకంతా గడిచిపోతే ఎంత బావుణ్ను. ఎదుగుతున్న కొద్దీ పెరుగుతున్న బాధ్యతలు, బాధలు, చింతలు.. అమ్మేది మెత్తని గులాబీలు అయినా నడిచేది ముళ్ల జీవితాలు. చిన్నవైన ఖర్చులు పెద్దవైపోతున్నాయి.

ఏ రోజు ధర ఆరోజే! మొగుడు ఊరంతా కొలిచినట్లు బలాదూరు తిరిగి వస్తాడు. వళ్లు మండి ఒకరోజు అడిగింది.

'ఊరి కొలతలన్నీ సరిగా ఉన్నాయా? ఏమన్నా మారాయా?'

'కొలతలు మారలేదు గానీ, ఓసోసి ఎన్నెన్ని బిల్డింగులు కట్టేస్తున్నారే పెళ్లామా! ఈళ్లకి అంత డబ్బు ఏడనుంచి వస్తుంది! మేడ మీద మేడ. ఎటు చూసినా మేడలే! తలెత్తి సూడాలంటే మెడ నొప్పెట్టి పోతుంది. అద్సరే గాని పెళ్లామా... మనం కూడా సచ్చేలోగా మేడ కడతామంటవా?'

ఆ ప్రశ్నకి అరుణ ఒక మాటు కోపంగా చూసి, తన పనిలో పడింది. ఇలాంటి పిచ్చి వాగుడు ఆమెకు చిరాకు.

•••

'ఎన్నాళ్లిలా బేవార్సుగా బతుకుతావు. నాతో పాటు రా కట్టుబడి పనులు నేర్చుకుందికానీ'

తాపీ మేస్త్రి తలుపులు అన్నాడు. ఇంత కాలానికి మొదటి మాటు అలాంటి మాటవిన్నాడు. అప్పడు. ఇదే తన జీవితానికి మలుపు అనుకున్నాడు. తలుపులు మేస్త్రికి ఆ మర్నాటినుంచి శిష్యుడైపోయాడు. ఓపిగ్గా చెప్పిన ప్రతి పనీ చేశాడు.

మట్టి మోసాడు, సున్నం కలిపాడు, ఇటుక రాళ్ల అందించాడు. సాయంత్రానికి ఆరొందలు సంపాదించి గాల్లో తేలిపోతూ.. జేబులో స్వార్జితం ఉక్కిరి బిక్కిరి చేస్తూంటే ఇంటికొచ్చాడు.

ఆమె కూని రాగం తీస్తూ అన్నం వండుతోంది. వెనకాలగా వెళ్లి గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు.

మెడ మీద ముద్దు కూడా పెట్టాడు. బలవంతాన విదిలించుకుంటూ 'అబ్బా వదలవయ్యా... నీ మోటు సరసం నువ్వూను' అంటూ విసుక్కుంది.

'ఇది చూడవే పెళ్లామా..' అంటూ జేబులోంచి ఆరొందలు తీసి చూపెట్టాడు.

'ఎక్కడవి డబ్బులు?' ఆశ్చర్యంగా అడిగింది. ఎక్కడవో చెప్పాక 'నిజమే!' అంది నమ్మలేనట్టు.

అంతే! అమాంతం మొగుణ్ని కౌగలించుకుంది. గట్టిగా ముద్దు పెట్టుకుని

'ఎప్పుడూ ఇలాగే ఉండు మామా.. మొగుడులా కాదు, మొగాడుగా ఉండు' అంది.

● ● ●

తరువాత కొన్నాళ్లకు...

'నువ్వు తండ్రివి కాబోతున్నావ్ అప్పుడు' అంది లేడీ డాక్టరు. అప్పుడి మనసు అమాంతంపైకెగిరి ఆకాశాన్ని తాకింది. మళ్లీకిందికి దిగొచ్చి 'అంతా బావుందా డాక్టరమ్మా?' ఆశగా అడిగాడు.

'ప్రస్తుతానికి బాగానే ఉంది. ఇవిగో మందులు వాడాలి. ఆకుకూరలు, పళ్లు తినిపించాలి. వంట్లో నెత్తురు తక్కువ ఉంది. పదిరోజులు కొకసారి పరీక్ష చేయించు..' చీటి చేతికిచ్చింది డాక్టరు.

ఆ రోజు నుంచి అరుణని గులాబీ పువ్వులా చూసుకున్నాడు. పూలమ్మటం మానేసి ఇంటిలోనే ఉండమంటే...

'చాల్లే ఊరుకో మావా, రేపు పుట్టబోయే బిడ్డ కోసం డబ్బులు దాయొద్దూ? నేను పనిమాను క్కూర్చుంటే ఆస్పత్రి ఖర్చులెట్టా వస్తాయి?' అంటూ నోరు మూయించింది అరుణ.

యధా ప్రకారం తట్టలో పూలు పెట్టుకెళ్లి, అమ్ముకొచ్చేది. అతడు కట్టుబడి పనిలో అనుభవం సంపాయించాడు. ఇద్దరి సంపాదన కొద్ది కొద్దిగా కూడ బెట్టసాగారు.పుట్టబోయే బిడ్డ గురించి ఊహలు పంచుకునేవారు. మగ బిడ్డ పుడితే తండ్రి పేరు, ఆడ పిల్ల పుడితే తల్లి పేరు పెడతానన్నాడు అప్పుడు.

'ముసిలోళ్ల పేర్లు దేనికి మావా! ఇప్పుడందరు ప్యాషనుగా పేర్లు పెడతన్నారుగా? మనం అట్టాగే పెడదాం..' అంది అరుణ.

'సరే అట్టాగే కానీవే.. మూడు నాలుగచ్చరాల్లో చిన్నపేరు పెడదాం. పిలవటానికి బావుంటాది' రాజీ పడ్డాడు అప్పుడు.

● ● ●

ఎక్కడో దూరంగా కుక్కలు ఏడుస్తున్నాయి.

ఉలిక్కి పడి నిద్ర లేచాడు.

చుట్టు చూశాడు. గుడిసెలో 'బెడ్ లైటు' వెలుగుతోంది. పక్కన అరుణ ఆదమరచి నిద్దరపోతోంది. ఉక్కపోతగా అనిపించి గుడిసె బయట కొచ్చాడు.

చీకటి రాత్రి కావడం చేత ఆకాశంలో నక్షత్రాలు మరింతగా వెలుగుతున్నాయి. నిద్ర తేలిపోయింది. అరుగు మీద కూర్చుని బీడీ వెలిగించాడు. ఆలోచనలు చుట్టుముట్టాయి.

ఏదో ఒకరోజు గుడిసెని అందమైన ఇల్లుగా మార్చేస్తాడు. తన చేతుల్తో తనకి కావల్సినట్టుగా కట్టుకుంటాడు. అందులో అరుణతో, అందాల బిడ్డతో ఆనందంగా బతుకుతాడు.

మనిషి కష్టపడేదెందుకు? సుఖపడేందుకేగా?

తను ఏ పనీ చెయ్యకపోవడమే సుఖమనుకుని చాలా కాలం సోమరిగా బతికాడు. కష్టంలోని సుఖమేమిటో తెలుస్తోంది. ఆకలి వేసినప్పుడు తినే అన్నం రుచిగా ఉంటుంది. అలసిపోయినప్పుడు పట్టే నిద్ర గాఢంగా ఉంటుంది. కష్టార్జితం గర్వంగా ఉంటుంది. ఈ నిజాలు ఇప్పుడు తనకి అనుభవంలోకి వచ్చాయి. మనిషి ఎన్నాళ్లు బతికాడని కాదు, ఎలా బతికాడని లోకం చూస్తుంది. అది మంచయినా, చెడయినా గమనించకుండా ఉండదు. గౌరవం, అగౌరవం లోకం గమనికలోంచే వస్తుంది.

బీడీ అవతల పారేశాడు. లేచినిలబడి బద్ధకంగా వళ్లు విరుచుకున్నాడు. సమయం అర్ధరాత్రి దాటినట్టుంది.

పల్చటి తెల్ల మబ్బులు నెత్తిమీదనుంచి వెళుత్తున్నాయి. వాటిపైన నక్షత్రాలు గుడ్డి దీపాల్లా వెలుగుతున్నాయి.

అంతలో ఇంట్లోంచి బాధగా మూలుగులు విన్పించాయి. కంగారుగా లోపలికి పరుగెత్తాడు. అరుణ బాధతో మెలికలు తిరిగిపోతూ కన్పించింది.

'ఏందే..ఏటయింది' ఆమె రెండు చేతులూ పట్టుకుని ఆందోళనగా అడిగాడు. 'ప్రాణం పోతున్నట్టుంది మావా. తట్టుకోలేక పోతున్నాను, తొందరగా మంత్రసాని మాలక్ష్మిని పిలూ..'

అప్పుడు ఇక క్షణం కూడా ఆగలేదు. మంత్రసాని మాలక్ష్మిది అక్కణ్నుంచి అయిదో ఇల్లు. వగరుస్తూ అక్కడికి పరుగులు తీశాడు. మంత్రసాని మంచి నిద్రలో ఉంది. అప్పడి కేకలకి అదిరిపడి లేచింది.

విషయం తెల్సుకొని వెంట పరుగుతీసింది.

'ముందు గిన్నెతో వేణ్ణీలు పెట్టు' అని అప్పడికి పురమాయించి తన పనిలోకి దిగింది. అప్పుడు గ్యాసు వెలిగించి వేణ్నీలు పెట్టాడు కానీ, మనసు ఆందోళనతో మరిగిపోతుంది. నీళ్లు ఎప్పుడు మరుగుతాయా – అన్నట్టు చూస్తున్నాడు. కళ్ల ముందు అరుణ గిలగిల కొట్టుకుంటున్న దృశ్యమే కదలాడుతోంది.

'అమ్మ అనిపించుకోవడానికి ఇంత నరకం అనుభవించాలా' మనసులో మధనపడసాగాడు.

తనకు పిల్లలు లేకపోయినా ఫర్వాలేదు కానీ, అరుణ ఈ నరకాన్ని అనుభవించకూడదు. బావుండాలి. ఎప్పట్లా ఉండాలి.

అంతలో పసిపిల్ల ఏడుపు విన్పించింది.

గబగబా గది దగ్గరకు పరుగెత్తాడు. మంత్రసాని చేతుల్లో అప్పుడే ప్రపంచ ప్రవేశం చేసిన ఆడపిల్ల ఉంది. ఎర్రగా.. ఎర్ర గులాబీలా...

'అప్పుడూ! ఆడ పిల్లపుట్టింది. పిల్ల అడ్డం తిరిగి కాన్పు చాలా కష్టమైంది. ఇలాంటి కాన్పులు ఆసుపత్రిలోనే చేయాల. అక్కడైతే ఆపరేషను చేసి తల్లిని బతికిస్తారు. ఇక్కడ ఇంటి దగ్గర అవకాశం లేదు ..' బాధగా చెప్పింది మంత్రసాని.

అంతే?! దడదడలాడుతున్న గుండెలతో అడిగేడు.

'తల్లి దక్కలేదు.. కష్టం మీద

పిల్ల దక్కింది..' ఆ ఎర్ర గులాబీని చేతికందించింది మంత్రసాని.

అప్పుడు విషణ్ణ వదనంతో పిల్ల కేసి చూస్తూ ఉండిపోయాడు.

ఎర్రగులాబీ అమాయకంగా నవ్వులు చిందిస్తోంది.

◆

ఆధునిక కాలంలో అభివృద్ధి పేరిట జరిగే ప్రతి కార్యకలాపమూ కాలుష్యాన్ని వెదజల్లుతోంది. మనకు ఆరోగ్య సమస్యలు తేవటంతో పాటు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోంది. 'గ్రీన్‌పీస్' సంస్థ సర్వే ప్రకారం మన దేశంలో ఏటా 10 లక్షల మంది వాయుకాలుష్యానికి బలవుతున్నారు. వాయుకాలుష్య ప్రధాన కారకాల్లో డీజిల్ వాడక యంత్రాల వినియోగం ఒకటి. వీటి నుంచి ఉత్పన్నమయ్యే పొగ గాలిని కలుషితం చేస్తుంది. మరి ఆ మసిని గాల్లో కలవకుండా నియంత్రిస్తే... దాన్నుంచి మరో ఉపయోగకరమైన ఉత్పాదన సాధిస్తే ...?

# 'పచ్చటి' సిరా...

భలే ఐడియా

ఢిల్లీ ఐఐటీ విద్యార్థులు ముగ్గురు డీజిల్ వాడక ఇంజిన్ల నుంచి వచ్చే మసి (బూడిద)ని ఇంకుగా మార్చే 'చకర్ షీల్డ్' పరికరాన్ని తయారు చేశారు. ఇది వ్యర్థం నుంచి అర్థాన్ని తీసే ఒక సరికొత్త ఆవిష్కరణ. దీనిద్వారా కాలుష్య నివారణతో పాటు కొత్త ఉత్పాదన కూడా సాధ్యమవుతోంది. ఈ ప్రయోగం ద్వారా ఐఐటి విద్యార్థులు ఎంతోమంది దృష్టిని ఆకర్షించారు.

పర్యావరణంపై ఉన్న మక్కువతో అర్పిత్ దూపర్, శ్రీవాత్సవ, ప్రతీక్ సచన్ అనే ఐఐటీయన్లు ప్రపంచ సైన్సు దినోత్సవం సందర్భంగా ఈ నూతన ఆవిష్కరణను వెలువరించారు. ఢిల్లీలో పుట్టి పెరిగిన వీరు కొన్ని సందర్భాల్లో అక్కడ వాయు కాలుష్యం రికార్డు స్థాయి కన్నా 10 రెట్లు అత్యధికంగా నమోదవటాన్ని గమనించారు. ఆరు బయట ఆడుకోవాలన్నా ఆడుకోలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. ప్రకృతిపై వారికున్న మక్కువతో ఈ ముగ్గురు కలిసి వాయు కాలుష్య నివారణకై 'చకర్ ఇన్నోవేషన్స్' అనే సంస్థను స్థాపించారు. దీని ద్వారా డీజిల్ వాడకాల నుంచి వాతావరణంలో కలిసిపోయే ధూళిని (మసిని) సేకరించి ఇంక్ ద్రవ్యాలుగా మార్చే 'చకర్ షీల్డ్' పరికరాన్ని తయారు చేశారు. దీనితో ఉత్పత్తి చేసిన ఇంకును పెయింటింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, పేపర్ ప్రింటింగ్‌కు వాడుతున్నారు.

**ఒకానొకరోజు ...**

వాతావరణ పరిరక్షణకు ఏదైనా చేయాలని ఆకాంక్షిస్తున్న వీరు ఒకరోజు చెరకు రసం తాగుతుండగా డీజిల్ ఇంజినున్న ఆ క్రషర్‌ని గమనించారు. ఇంజిన్ నుంచి వచ్చే పొగ నేరుగా గాలిలో కలవకుండా ఆ యజమాని పొగగొట్టాన్ని గోడవైపు పెట్టాడు. దీంతో, కార్బన్‌తో నిండిన పొగ గోడపై, చాలా భాగం అంటుకుపోతోంది. దీంతో ఆ గోడంతా నల్లగా మారింది. దీనిని ఆ మిత్రత్రయం ఆసక్తికరంగా పరిశీలించింది. ఈ మసితో ఇంకును తయారు చేయవచ్చనే స్ఫూర్తి ఆ దృశ్యం ద్వారానే వారికి కలిగింది.

**చాకర్ షీల్డ్ పనితీరు**

మెకానికల్, కెమికల్, టెక్స్‌టైల్‌కు సంబంధించిన 15 మంది ఇంజినీర్లు కలిసి వాతావరణ రక్షణకర అభివృద్ధికై పనిచేయాలని నిర్ణయించుకున్నారు. 'చకర్' అంటే చక్రం. అర్థంలాగానే తిరిగి వాడబడుతుంది. డీజిల్ ఉపయోగించి వాడే వాహనాలు, జనరేటర్ల ఇంజిన్ నుంచి వచ్చే నల్లని ధూళిని సేకరించడానికి తయారు చేసిన చకర్ షీల్డ్‌ను వాటి పొగ గొట్టాల వద్ద అమర్చుతారు. ఇలా చేయడం వల్ల ఇంజిన్‌కు ఎటువంటి నష్టం వాటిల్లదు. దీనిపై వారు దాదాపు రెండేళ్లు రీసెర్చి చేశారు. వాతావరణంలో కలిసే కార్బన్ పదార్థాలను 75 నుంచి 90 శాతం వరకు దీని ద్వారా సేకరిస్తారు. దానితో ఇంకును ఉత్పత్తి చేస్తారు.

'చకర్ ఇన్నోవేషన్' కంపెనీ ద్వారా ప్రభుత్వ సంస్థలైన



ఇండియన్ ఆయిల్, రియల్ ఎస్టేట్ డెవలపర్స్, ఇతర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో 50 పరికరాలను ఏర్పాటు చేయటం ద్వారా తొలి సంవత్సరంలోనే రూ.కోటి పైనే సంపాదించారు. 500 కేజీల మసితో 20 వేల లీటర్ల ఇంకును ఉత్పత్తి చేశారు. వచ్చే ఏడాది మరో 50 పరికరాలను తయారు చేయాలనుకుంటున్నారు. ఢిల్లీ దగ్గరలోని గుర్గావ్‌లో, చెన్నై దక్షిణ ప్రాంతంలో వారు తయారు చేసిన షీల్డ్‌లను వాడుతున్నారు. ఇలాంటి టెక్నాలజీనే ఉపయోగించి బెంగళూరుకు చెందిన విద్యార్థులు కూడా వాహనాల నుంచి సేకరించిన మసితో ఇంకును తయారు చేస్తున్నారు.

**- కోడె హేమలత**




# ఓ స్వేచ్ఛా స్వరం...

> **నాలుగేళ్ల ఓ పిల్లవాడు అమ్మఒడిలో తలపెట్టుకుని కథవింటూ ఊ.. కొడుతూ నిద్రలోకి జారుకుంటాడు. చల్ చల్ గుర్రం అంటూ నాన్న వీపుపైకి ఎక్కి ఇల్లంతా సవారీ చేస్తాడు. అప్పడప్పడే పాఠశాల వాతావరణానికి కొంచెం అలవాటు పడుతుంటాడు. కానీ, ఇక్బాల్ కథ వేరు. తండ్రి అప్పకు, తప్పకు వెట్టిచాకిరీ కోరల్లో చిక్కాడు. తరువాత తనకు తానే ఆ కూపం నుంచి బయటపడి.. పన్నెండేళ్ల వయసుకే గొప్ప వక్త అయిపోయాడు. వెట్టిచాకిరీకి, బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా గొంతెత్తాడు. అది నచ్చని కుత్సిత శక్తులకు బలయ్యాడు. అయినా, ఆ బాలుడు ఓ లిటిల్ రియల్ హీరో. విముక్తి కోరే ప్రపంచానికి ఓ స్వేచ్ఛాస్వరం!**

చూడటానికి నాలుగే అడుగులు. బరువు 20 కేజీల్లోపే. గుండెనిబ్బరం తక్కువేమీ కాదు. చురుకైనవాడు. చలాకీ అయిన వాడు. తెలివైనవాడు. ముందుచూపు ఉన్నవాడు. అన్నిటికీ మించి సమాజ హితవుని కోరుకునేవాడు. ఇన్ని గుణాలు కేవలం 12 సంవత్సరాల వయసువాడిలోనే ఉన్నాయి. కానీ, అతడొక బందీ..

### తండ్రి చేసిన అప్పు కోసం...

ఇక్బాల్ మాసిహ్.. 1983లో పాకిస్తాన్‌లోని లాహోర్ నగరంలో పుట్టాడు. ఇక్బాల్‌కి నాలుగేళ్ల వయసప్పుడు తండ్రి ఓ కార్పెట్ వ్యాపారి వద్ద రూ.600లు బాకీ పడ్డాడు. అది తీర్చలేక .. బాకీ చెల్లించేవరకూ ఇక్బాల్‌ను అక్కడే ఉంచుకొని.. పనిచేయించుకొమ్మని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ వ్యాపారి పరమ కర్కోటకుడు. ఇక్బాల్‌ను గొలుసులతో కట్టేసి వారం రోజులూ పని చేయించేవాడు. రోజుకొక రూపాయి ఇచ్చేవాడు. పసి ఇక్బాల్ అలా కష్టపడుతూనే కార్పెటు తయారీ పని నేర్చుకున్నాడు.

### తప్పించుకొని..

బాల కార్మికులచేత పని చేయించుకోవడం చట్టవిరుద్ధమని అప్పట్లో పాకిస్తాన్ కోర్టు తీర్పునిచ్చింది. ఆ సమయంలో ఇక్బాల్ యజమాని కార్పెట్ వ్యాపారి నుంచి తప్పించుకుని పోలీసులకు రిపోర్టు చేయడానికి వెళ్లాడు. కానీ, పోలీసులు ఇక్బాల్‌ని అరెస్టు చేశారు. పోలీసులు తనకు ఎలాంటి సహాయమూ చేయబోరని అర్థం చేసుకున్న ఇక్బాల్... అక్కడ నుంచి తెలివిగా తప్పించుకున్నాడు. ఆ సమయంలో బిఎల్‌ఎల్‌ఎఫ్ (బాండెడ్ లేబర్ లిబరేషన్ ఫ్రంట్)కు చెందిన కార్యకర్త కనపడడంతో జరిగిన కథంతా చెప్పాడు. ఇక్బాల్‌ని ఆ సంస్థ నడుపుతున్న పాఠశాలలో చేర్చుకున్నారు. ఇక్బాల్ మహా చురుకు. నాలుగేళ్ల చదువుని రెండేళ్లలో పూర్తి చేశాడు. తాను పడ్డ బాధ మరే ఇతర పిల్లవాడూ పడకూడదని ఆలోచించడం ప్రారంభించాడు. బాల కార్మికులకు అండగా నిలబడాలని నిశ్చయించుకున్నాడు. స్వీడన్, యుఎస్ఏకు వెళ్లి అక్కడి కార్మికుల స్థితిగతుల గురించి స్వయంగా తెలుసుకున్నాడు. చిన్న వయసులోనే ఎంతో ఉన్నతంగా ఉపన్యాసాలను ఇచ్చేవాడు. అంతర్జాతీయ సమావేశాలకు హాజరై అనర్గళంగా మాట్లాడేవాడు. అబ్రహం లింకన్, ఇసాక్ ఉల్లా ఖాన్ వంటి వారు బాల కార్మికుల గురించి పోరాడారని చెప్పేవాడు. పాకిస్తాన్‌లో బాల కార్మికులు లక్షలాది మంది స్వేచ్ఛలేక మగ్గుతున్నారని, అందులో తాను మాత్రమే తప్పించుకుని చదువుకోగలిగాననీ, ఇంకెందరో పిల్లలు తన లాగే స్వేచ్ఛకావాలని కోరుకుంటున్నారని ఉపన్యాసాల్లో చెప్పేవాడు.

### కాల్చి చంపేశారు

ఇదంతా కొందరికి నచ్చలేదు. ప్రభుత్వానికీ నచ్చలేదు. చిన్న బాలుడే వారికి పెద్ద ప్రమాదంగా కనిపించాడు. అతడి హక్కుల గొంతు వారికి ఆపద స్వరంగా ధ్వనించింది. 1995 ఏప్రిల్ 16న పాకిస్తాన్ లాహోర్‌లోని మరిద్కేలో ఉన్న తన బంధువుల ఇంటికి సైకిల్‌పైన వెళ్తున్నాడు ఇక్బాల్. దారి మధ్యలోనే ముష్కరులు ఆ పసివాడిని బలిగొన్నారు. నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేశారు. అప్పటికి ఇక్బాల్‌కి 12 సంవత్సరాలు.

ఈ సంఘటనపై బిఎల్‌ఎల్‌ఎఫ్ తీవ్రంగా స్పందించింది. తమ సామాజిక కార్యకర్తను చంపినందుకు పెద్దఎత్తున ఆందోళనను చేపట్టింది. బాల కార్మికుల చేత వెట్టి చేయిస్తున్న వ్యాపార సంస్థలపై దాడులు చేసి, బాలకార్మికులకు విముక్తి కల్పించాలని, ఇక్బాల్ హంతకులను కఠినంగా శిక్షించాలని కోరింది. బాల కార్మికులు ఎక్కువ వేతనం పొందుతున్నారని పాకిస్తాన్ ప్రభుత్వం వాదించింది. ఇక్బాల్ హత్య ఎందరినో కదలించింది. ప్రభుత్వ నిఘా, నిషేధాలు ఉన్నా అంత్యక్రియలకు 800 మందికి పైగా సానుభూతి పరులు హాజరయ్యారు. ఇక్బాల్ గాధతో ఎందరో స్ఫూర్తి పొందారు.

### ఇప్పుడు తనొక నినాదం

1994లో ఇక్బాల్ 'రీబాక్ హ్యూమన్ రైట్' అవార్డును బోస్టన్‌లో అందుకున్నాడు. ఇక్బాల్ వాస్తవ కథను తెలుపుతూ 'ద లిటిల్ హీరో వన్ అండ్ ఓన్లీ ఫైట్స్ ఫర్ ఫ్రీడం' అనే పుస్తకాన్ని ముద్రించింది బిఎల్‌ఎల్‌ఎఫ్. కెనడాలోని స్వచ్ఛంద సంస్థ, ఇక్బాల్ ఫౌండేషన్ కలిసి 'ఫ్రీ ది చిల్డ్రన్' అనే సంస్థను ప్రత్యేకంగా పిల్లల కోసం ప్రారంభించారు. దీనిని ఆదర్శంగా తీసుకుని పాకిస్తాన్‌లోనూ సుమారు 20 పాఠశాలలను ఏర్పాటు చేశారు. కామినో జువెనిల్ సాలిడేటరీ (సిజెఎస్)ని ప్రత్యేకంగా యూత్‌కోసం 1996లో స్పెయిన్‌లో ప్రారంభించారు. 1998లో ఇటలీలో ఇక్బాల్ పేరుతో పాఠశాలలను ఏర్పాటు చేసి సమగ్రంగా నిర్వహిస్తున్నారు. ఇక్బాల్ మరణానంతరం చైల్డ్ హక్కుల కోసం 2000 సంవత్సరంలో వరల్డ్ చిల్డ్రన్స్ ప్రైజ్‌ను అందించారు. 'యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ చైల్డ్ లేబర్ ఎలిమినేషన్' కోసం 2009వ సంవత్సరంలో ఇక్బాల్ అవార్డును స్థాపించారు. సిసిలీలోని క్యాటానియాలో ఇక్బాల్ పేరుతో టోర్నమెంట్‌ను నిర్వహించారు. చాలా దేశాలు 2017 నుంచి ఏప్రిల్ 16ను బాలకార్మికుల వెట్టిచాకిరి వ్యతిరేక దినంగా ప్రకటించాయి.

తల్లిదండ్రులకూ, విద్యకూ, స్వేచ్ఛకూ దూరమైన ఇక్బాల్ ఇంకెవరూ తనలా కోల్పోకూడదని గట్టిగా పోరాడిన వైనం ఎంతో స్ఫూర్తిదాయకం.

- ఐక్యత

ఫిబ్రవరి 28 : జాతీయ సైన్సు దినోత్సవం

- డా॥ కాకర్లమూడి విజయ్
98490 61159

అట్టమీది కథ

# సైన్సులో మన ముద్రేది...?

మనకు తెలిసినా, తెలియకపోయినా- ఈ ప్రపంచం, విశ్వం కొన్ని విజ్ఞాన సూత్రాల ఆధారంగా నడుస్తాయి. ప్రతి చర్య వెనకా ఓ కచ్చితమైన కార్యాకారణ సంబంధం ఉండితీరుతుంది. ఈ బంధాన్ని ఒక క్రమపద్ధతిలో తెలుసుకోవటానికి అనాది నుంచి ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఫలితంగా ఎన్నో నిర్ధారణలూ వెలువడ్డాయి. అదే సైన్సు. అదే విజ్ఞానశాస్త్రం. ఒకదేశం సైన్సును ఎంతగా ఒంటపట్టించుకుంటే- అంతగా అభివృద్ధి ఫలాలు సాధిస్తుంది. ప్రతి దానినీ చెల్లిపోయిన కాలంలోని చెదపట్టిన భావాలతో ముడిపెడితే- శాస్త్రీయ ప్రగతి దారుణంగా కుంటుపడుతుంది. మా గతం ఘనం అంటూ ఆచరణకు నిలవని, పరీక్ష నాళికకు అందని కాకమ్మ కబుర్లు చెబితే- మన వైజ్ఞానిక మార్గం ముందుకు సాగదు. శాస్త్ర సాంకేతిక సమాచార రంగాలు అత్యంత అద్భుతంగా దూసుకుపోతున్న వేళ... ఆ ప్రస్థానంలో మన దేశం స్థానం ఎక్కడ ఉంది? ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సందర్భం ఇది.

ప్రపంచవ్యాప్తంగా కొత్త ఆలోచనలు, కొత్త ప్రశ్నలు, కొత్త పరిష్కారాలు, కొత్త సవాళ్లు, కొత్త సమాధానాలు ఒక కొత్త తరపు మానవ ప్రవర్తనను ముందుకు తెస్తున్నాయి. అందుకు ముఖ్య కారణం సైన్సు. మానవులు ఈ భూమి మీద సుమారు 66 మిలియన్ సంవత్సరాల క్రితం ఆవిర్భవించారు. పులులు 2 మిలియన్ సంవత్సరాల క్రితం ఆవిర్భవించాయి. మానవులు కూడా చాలా కాలం పాటు పులుల లాగే గుహల్లో నివసిస్తూ, పచ్చి మాంసం వేటాడి తింటూ అడవుల్లో కాలం గడిపారు. తరువాత ఒక క్రమపద్ధతిలో పరిణామం చెంది.. ఈ స్థాయికి చేరుకున్నారు. కానీ ఇప్పటికీ పులులు అదేవిధంగా జీవిస్తున్నాయి. అందుకు కారణం మానవులకు ఉన్న ఆలోచనా శక్తి. పులులకు ఆకాశంలో నక్షత్రాలు, వర్షం, గాలి విషయాలు తట్టకపోయి ఉండవచ్చు, కానీ, మానవులకు ఆ ఆశ్చర్యాలు సందేహంగా మారి వాటి గురించి తెలుసుకోవాలనే ఉత్సుకత వారిని ఈ దశకు తెచ్చింది.

## సైన్సే సర్వస్వం

సైన్సు లేనిదే ప్రస్తుత కాలంలో దాదాపు ఏదీ లేదనే స్థాయికి వచ్చాం. నిజానికి సైన్సు లేనిదే ప్రస్తుత కాలం కూడా ఉండేది కాదేమో! ఆధునిక కాలానికి ఆధునికత ఏర్పడింది సాంకేతిక శాస్త్రంతోనే కదా. మన ఆహారం నుంచి మన ఆనందాల వరకూ సైన్సు విస్తరించింది. రోజువారీ జీవితంలో ప్రతి విషయమూ సైన్సుతో ముడి పడి ఉంది. అవని పరిధులు తెలుసుకున్నా, కడలి అగాధాలు అర్థం చేసుకున్నా, విశ్వరూపాన్ని అవగాహన చేసుకున్నా, కనిపించని కాలం మహిమకు ఆశ్చర్యపడుతున్నా... అంతా సైన్సు వల్లనే!

అయితే, సైన్సు అంతా వివరిస్తుందా? అంటే కాకపోవచ్చు. శాస్త్రీయ ప్రశ్నలు సంక్షిప్తంగా

అనిపిస్తాయి. చక్కెర నీటిలో ఎందుకు కరుగుతుంది? ఉడకబెట్టిన గుడ్డు మెత్తగా ఎందుకు అవుతుంది? మరీ ఉడకబెడితే అది గట్టిగా ఎందుకు మారుతుంది? వంటి రోజువారీ సందేహాలకు సైన్సు సంతృప్తికరంగా వివరణ ఇచ్చింది. గాలేల వీచు, సలిలంబు ఏల పారు, ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను? వంటి భావాత్మక ప్రశ్నలకు సైతం సైన్సు జవాబు ఇచ్చింది. ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలు వెదకడంలో మరిన్ని కొత్త ఆవిష్కరణలకు వీలవుతుంది. మన మెదడు ఎలా కొన్ని వివరాలు గుర్తు పెట్టుకుంటుంది? లేదా అసలు ప్రశ్నలు ఎందుకు వస్తాయి వంటి వాటికి ఇంకా వివరణ కావల్సి ఉంది.




**విజ్ఞాన ప్రస్థానంలో మన స్థానం?**

అప్పుడప్పుడు ఇటువంటి ప్రత్యేక రోజుల పేరుతో సైన్సుని గుర్తు చేసుకున్నా, సైన్సు ఫలితాలను ప్రతి క్షణం మనం అనుభవిస్తూనే ఉన్నాం. కానీ వందల కోట్ల మానవ మేధలు నివసించే ఒక సువిశాల దేశంగా సైన్సు పట్ల మనం చేసిందేమిటి, చేస్తున్నదేమిటి? మనకంటే చిన్న దేశాల నుంచి సైన్సు ఆవిష్కరణలు విస్తారంగా వస్తున్నాయి. ఒకప్పుడు మనమూ ప్రపంచ శాస్త్ర పటంలో స్పష్టంగా కనిపించినా, రాను రాను ఆ ప్రభ సన్నగిల్లింది. మా ఫలానా వాటిలో ఇవన్నీ అప్పుడే ఉన్నాయి అని చెప్పుకునే ధోరణితో బాటు ఇప్పుడు మన శాస్త్రవేత్తలు అప్పుడప్పుడో నోబెల్‌లు తెచ్చుకున్నారు అనే స్థాయికి వచ్చాం. ఈ 'అప్పుడెప్పుడో' నుంచి 'ఇప్పుడు, ఇకముందు కూడా' అనేది ఎందుకో కనిపించడం లేదు. అందుకు కారణం, పురాణాలు, హేతుబద్ధతల మధ్య చర్చ ఆర్యభట్టు అంత పురాతనమైనది. అయినా ఈనాటికీ అది తేలలేదు. ఇటీవల ముగిసిన సైన్స్ కాంగ్రెస్‌లో అటువంటి పురాణ సంబంధ విషయాలు శాస్త్రం చదివిన వారినుంచి రావడం అన్నది ఆందోళన కలిగించే విషయం. అటువంటి ఆశావహ దృక్పథం శాస్త్రీయ రంగంలో కొరవడినట్టు అనిపిస్తోంది.

అసలు సైన్సు ఏమిటి? మన చుట్టూ కనిపించే దానిని మెరుగ్గా అర్థం చేసుకోవడానికి దోహదపడే ప్రక్రియ. అటువంటి అవగాహన కేవలం ప్రశ్నలు, ఉత్సుకత, ఆశ్చర్యం వంటి స్పందనలకు సమాధానాల నుంచి వస్తుంది. ఈ క్రమంలో మన కంటికి కనిపించని విషయాలు కూడా విశేషాలుగా కనిపిస్తాయి, అర్థం అవుతాయి. ఆ అర్థం అవ్వడం ముందుకు వెళ్ళి, సృజనాత్మకంగా మరిన్ని కొంగొత్త వివరాలను తెలుసుకునేలా చేస్తుంది. ప్రతి వస్తువు, ప్రతి సంఘటన, ప్రతి ఆలోచనకు మూలం దొరుకుతుంది, వివరణ దొరుకుతుంది. అటువంటి సమాచారం సాయంతో ఎన్నో కొత్త ఆవిష్కరణలు సాధ్యపడి, మానవ జీవితానికి వెసులుబాటు కల్పిస్తాయి. కొండొకచో మానవ జీవితానికి కొన్ని సైన్సుపరమైన ఇబ్బందులు కూడా కలుగుతాయి. మనకి తెలిసిందే, మనం వివరించగలిగినదే సైన్సు కాకపోవచ్చు. మన జ్ఞానపరిధిలో ఇప్పటికి దీనిని ఈ విధంగా వివరించాం. మన విజ్ఞానం పెరిగేకొద్దీ మన దృక్పథం కూడా పెరుగుతుంది, మెరుగవుతుంది. అప్పుడు మరింత మెరుగైన విశ్లేషణలు, వివరణలు అందుబాట్లోకి వస్తాయి, రావాలి కూడా.

**మనకు తొలి గుర్తింపు**

సుమారు తొంభై ఏళ్ళ క్రితం, 1930లో, చంద్రశేఖర వెంకట రామన్‌కి సైన్సు (భౌతికశాస్త్రం)లో భారతదేశం నుంచి మొట్టమొదటి గుర్తింపు, నోబెల్ పురస్కారం లభించింది. విశేషం ఏమిటంటే, 1928, ఫిబ్రవరి 28న ఆయన ఒక కొత్త వికిరణాన్ని (A new radiation) కనుగొన్నారు. ఆ ఆవిష్కరణ ఆయన పేరు మీదే 'రామన్ ప్రభావం'గా ప్రాచుర్యం పొందింది. అందుకు ఆయనకు నోబెల్ పురస్కారం లభించింది, ఆ తేదీకి గుర్తుగా మనకు జాతీయ శాస్త్ర దినోత్సవం ఆవిర్భవించింది.

జగదీశ్ చంద్రబోస్, హరగోబింద్ ఖోరానా, శ్రీనివాస రామానుజన్, హోమీ జహంగీర్ బాబా, బీర్బల్ సాహనీ, ప్రశాంతచంద్ర మహలనోబిస్ సత్యేంద్రనాథ్ బోస్, మేఘనంద్ సాహా, ప్రఫుల్ల చంద్ర రే, సలీం అలీ, అబ్దుల్ కలాం, సుబ్రహ్మణ్య చంద్రశేఖర్, శాంతి స్వరూప్ భట్నాగర్, విక్రం సారాభాయ్, సిఆర్ రావ్, కె.చంద్రసేఖరాన్, జి.ఎన్.రామచంద్రన్, హరీష్‌చంద్ర, మనాలి కల్లట్ వైను బప్పు వంటి మహామహులు ఇక్కడివారే! అనేక శాస్త్ర రంగాల్లో వారు విశ్వవిఖ్యాత ప్రతిభ చూపారు. ప్రపంచ దృష్టిని మనవైపు మరలించారు. కానీ, ఇంతవరకూ మన నుంచి వచ్చిన ఇటువంటి విశిష్టులను వేళ్ళ మీద లెక్కబెట్టవచ్చు. ఇంత జనాభాలో ఇంతేనా అంటే వాస్తవానికి ఇంతే!

**ఎందుకీ వెనకచూపు?**

మన దేశంలో ఒక విచిత్ర పరిస్థితి నెలకొని ఉంది. వేళ్ళూనుకుపోయిన బలమైన



### సైన్సుడే ఎలా వచ్చిందంటే...?

**సర్ సివి రామన్ ఆవిష్కరణ అయిన 'రామన్ ఎఫెక్ట్'కు (ఒక కాంతి పుంజం అణువుల వల్ల మార్గం మళ్ళితే, తరంగ దైర్ఘ్యంలో మార్పు వస్తుంది అనేది రామన్ ప్రభావం) గుర్తుగా మన దేశంలో ప్రతి ఫిబ్రవరి 28ని జాతీయ సైన్స్ దినోత్సవంగా పాటిస్తున్నారు. ఈ ఆవిష్కరణ రామన్‌కి 1930లో నోబెల్ పురస్కారాన్ని సంపాదించింది. రామన్‌కి 1954లో భారతరత్న పురస్కారం లభించింది. మొట్టమొదటి జాతీయ సైన్స్ దినోత్సవం 1987లో జరుపుకున్నారు. నిత్య జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత గురించి ప్రకటించడం, సైన్సులో జరిగే కృషి, సాధించిన విషయాలను ప్రదర్శించడం, కొత్త టెక్నాలజీలను చర్చించి, అమలుచేయడం, శాస్త్రీయ దృక్పథానికి అవకాశాలు కల్పించడం, సైన్సు, టెక్నాలజీ ప్రాచుర్యాన్ని ప్రోత్సహించడం ఈ రోజు లక్ష్యం. ఈ సంవత్సర నినాదం : 'ప్రజల కొరకు సైన్సు, సైన్స్ కొరకు ప్రజలు'.**

సాంప్రదాయాలు, బహుళ మత విశ్వాసాలూ, అనంతమైన మూఢ నమ్మకాలూ, పరిజ్ఞానాన్ని తప్ప విజ్ఞానాన్ని, ప్రపంచ జ్ఞానాన్ని బోధించడంలో విఫలమైన విద్యా వ్యవస్థ, అనాదికాలం నుంచి ఇంకా వేళ్ళాడుతున్న సాంఘిక దురాచారాలూ, యువతను బలోపేతం చేయాల్సింది పోయి, తమ స్వార్థానికి వాడుకుని, దానిని నిర్వీర్యం చేసి, నిరుపయోగ ఆవేశంగా మార్చే ప్రభుత్వాలు, ఎటు కదలాలో ఎక్కడ స్థిరపడాలో తెలియక విచిత్రమైన సందిగ్ధతలో కొట్టుమిట్టాడుతున్న యువకులు, సైన్సుని వాడుకుంటూనే సైన్సు పట్ల అవగాహన లేని వారూ ... ఇలా బహు విచిత్రమైన స్థితిలో మన దేశం ఉంది. ఇన్నిటి మధ్యనుంచి శాస్త్రవేత్తలు ఆవిర్భవించడం అంత సులభం కాదు. కానీ, ఆ అవసరత, ఆవశ్యకత ఉంది.

అయితే అందుకు మనదేశంలో విద్య, పరిశోధన వ్యవస్థలు సహకరిస్తున్నాయా అనేది ప్రశ్న. చిన్నప్పటినుంచే పిల్లల్లో జిజ్ఞాస రేకెత్తించాల్సిన విద్య ఇంజినీరింగ్, వైద్యం అనే రెండు లక్ష్యాలనే నిర్ధారిస్తుంది. (విద్యా వ్యవస్థే కాకుండా తల్లి దండ్రులూ ఇదే దృష్టితో చూస్తారు). ఆ రెండు లక్ష్యాలనూ సాధించలేని వారు అయిష్టంగానో, అనాసక్తితోనో ఇతర రంగాల వైపు వెళ్తున్నారు. ఆ కారణంగా, ఇష్టమైన విద్యనూ పొందడం లేదు, ఇష్టంలేని రంగాల్లో బలవంతంగా (నిస్సహాయంగా) చేరుతున్నారు. ఫలితం, రెండు రంగాల్లోనూ వారి పనితనం సన్నగిల్లుతోంది. కొంతమంది ఏదో విధంగా పరాయి దేశాలకు వలస వెళ్లి, అక్కడ వసతులు, బృందాలతో పని చేసి శాస్త్రీయ పరిశోధనలో తమ ముద్ర వేస్తున్నారు. అటువంటి వారి ప్రతిభ బయటకు వచ్చినప్పుడు మాత్రం మనం వాళ్ళు 'మన'వాళ్ళే అని ఆనంద పడతాం. అంతే గానీ, నిజంగా ఆ ప్రతిభావంతులను ఇక్కడే ఉండేలా చేసే వ్యవస్థ మనకు ఉందా? ప్రస్తుతం ఉన్న పరిశోధనా సంస్థలు ఎంతమందిని ప్రపంచ పరదాపైన కనిపించేలా చేశాయి?

శాస్త్రీయ దృక్పథం పుట్టుకతోనే అబ్బేది కాదు. అది చుట్టూ ఉన్న వాతావరణం వల్ల క్రమేపీ అభివృద్ధి చెందుతుంది. సరైన సహకారం, ప్రోత్సాహం, వనరులు ఉంటే అటువంటి దృక్పథం, జిజ్ఞాస ఉన్నవారు మెరుగవుతారు, రాణిస్తారు. కానీ అటువంటి శాస్త్రీయ జిజ్ఞాసను రేకెత్తించాల్సింది మాత్రం మన పెద్దలే, మన గురువులే, మన పుస్తకాలే! విద్యా సంస్థల పరీక్షల్లో విఫలమైనంత మాత్రాన అసలు తెలివే లేదని తేల్చేసి నిరుత్సాహపరిస్తే, బహుశా ఒక మేధావిని చంపేసినట్టే!

విశేషమేమిటంటే, శాస్త్రరంగంలో పేరున్న వారు కూడా ఆధునిక సైన్సును అవహేళన చేసేలా ప్రవర్తించడం. గత కొన్ని సైన్సు కాంగ్రెస్‌లలో పెద్దలు శంఖం ఊదడం, మన పురాణాల్లో క్షిపణులు, రాకెట్లు, విమానాలూ, టెస్ట్ ట్యూబ్ బేబీలు ఉన్నాయనడం, శివుడు కంటే మహా పర్యావరణవేత్త లేడు అనడం వంటివి చూస్తే- అసలు మన సైన్సు ఎటువైపు వెళ్తుంది అనే సందేహం కలగడం సహజం.

## విజ్ఞాన తృష్ణ కావాలి!

మేధ అభివృద్ధి చెందుతుంది, అలవడుతుంది. అందుకు ఆలోచన అవసరం. ఆలోచనకు ఆసక్తి అవసరం. ఆసక్తికి కోరిక అవసరం. కోరికకు చుట్టూ ఉండే సరైన వాతావరణం అవసరం. అటువంటి వాతావరణం కల్పించడం పెద్దలుగా మన కర్తవ్యం. అంతేగానీ నీ లక్ష్యం ఫలానా డిగ్రీ కావాలి, ఫలానా ఉద్యోగం కావాలి అని ముందే నిర్ధారించేసి, అటువైపు మాత్రమే తోస్తే సరిపోదు. అలా చేస్తూ పోతే, అసలు మన దేశం నుంచి ప్రపంచ దృష్టిలో పడే శాస్త్రం రాకపోవచ్చు. మనకు ఏ పుష్కరానికో ఒక నోబెల్ (అదీ మన దేశం నుంచి వెళ్ళిపోయి ఎక్కడో స్థిరపడిన వారినుంచి) కాకుండా, కనీసం అడపాదడపా వస్తుంటే, కోట్ల జనాభాకు ఒక సార్థకత లభిస్తుంది. సైన్సు అభివృద్ధికి ఊతమూ చేకూరుతుంది.

★

## ఉత్సుకత నుంచే ఉన్నతాలకు...

రామన్ ప్రభావం నేపథ్యంలో ఒక సంఘటన ప్రస్తావనలో ఉంది. రామన్ ఒకసారి ఇంగ్లాండ్‌కు సముద్ర ప్రయాణం చేస్తున్నాడు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రాల్లో రామన్ ఓడపై నిలబడి ఆకాశాన్ని, సముద్రాన్ని చూస్తూ ఉండేవాడు. అతను గమనించింది, ఆకాశం నీలంగా ఉంది, కింద సముద్రమూ నీలంగా ఉంది. దీనికి కారణం ఏమిటన్న ఆలోచన నుంచే రామన్ ప్రభావం ఉద్భవించింది అంటారు. అలాగే, చిన్నప్పుడు స్కూలు పాఠ్య పుస్తకాల్లో చెప్పే జేమ్స్‌వాట్ కథ కూడా అటువంటిదే. జేమ్స్‌వాట్ టీ కాసే కెటిల్ నుంచి వచ్చే ఆవిరిని చూస్తూ ఉన్నప్పుడు, ఆ ఆవిరి వల్ల దాని మూత పడిపోవడం గమనించడం, అది ఎందుకు పడిపోతోంది, దాన్ని ఏమి తోస్తోంది అనే సందేహం నుంచి ఆవిరి శక్తి, ఆ తర్వాత ఆవిరి యంత్రం ఆవిర్భవించాయి. ఆ ఆవిష్కరణ ఏకంగా పారిశ్రామిక విప్లవానికే దారితీసింది. శాస్త్రీయ దృష్టికి ఉండే శక్తి అటువంటిది.

## విజ్ఞానాకాశంలో విహరించనీయండి

శాస్త్రం అంటే పరీక్షలకు నిలిచేది. ప్రయోగాలకు అందేది. కొలమానాల్లో ఒదిగేది. దానిలో నిగూఢత ఉండదు. మహత్యం ఉండదు. కొందరికే పరిమితం అవదు. అర్థం చేసుకునే అందరికీ అవగతం అవుతుంది. ఏ సమూహపు ఆచరణలోనైనా సైన్సు అంతర్లీనంగా ఉంటుంది. ఎవరైనా బతకటానికి గాలి పీల్చుకోవల్సిందే! ఆహారం తీసుకోవల్సిందే! తినటం, విసర్జించటం వంటి పనులు చేయాల్సిందే! మామూలు మనుషులకైనా, మహామహులకైనా జీవన సూత్రాలు ఒకటే.

- ఈ విషయాలు బాల్యం నుంచి పిల్లల ఆలోచనల్లో భాగం కావాలి. ప్రతి క్రియ వెనకా ఓ కార్యాకారణ సంబంధం ఉందన్న సంగతిని అవగతం చేయాలి. అప్పుడు ఆచరణకు, ఆలోచనకు సమన్వయం ఏర్పడుతుంది. శ్వాసలాగానే సైన్సు మనలో ఒక భాగమవుతుంది.
- కానీ, సరిగ్గా ఇక్కడే చాలా సందర్భాల్లో ఆచరణకు, ఆలోచనకు సమన్వయం తప్పుతుంది. సైన్సు సంబంధ కార్యానికి దానికి సంబంధం లేని మరొక అతీత భావాన్ని పెనవేసే ప్రయత్నం జరుగుతుంది. వర్షం ఎందుకు కురుస్తుంది? జ్వరం ఎందుకు వస్తుంది? ఉరుములు, మెరుపులు ఎలా వస్తాయి? వంటి ప్రశ్నలకు సైన్సు చెప్పే సమాధానాలు వేరే! సామాన్యుల ప్రాచుర్యంలో ఉన్నవి వేరే! ప్రాచుర్యంలో ఉన్న కథలూ భావాలూ పిల్లలను దారి తప్పిస్తాయి. సైన్సుని సైన్సుగా అర్థం చేసుకోవటానికి అడ్డంకిగా నిలుస్తాయి. ఒక బలీయమైన సహజ జిజ్ఞాసకు ఆదిలోనే తూట్లు పొడుస్తాయి. ఏ సమాజంలో మూఢాచారాలు, అతీత నమ్మకాలు, అద్భుత శక్తులపై భ్రమలూ అధికంగా పేరుకుపోయి ఉంటాయో - ఆ సమాజంలో విజ్ఞాన విస్తరణ నెమ్మదిస్తుంది. కొందరు కావాలని అతీత శక్తులకు, సూడో సైన్సుకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రచారం చేస్తారు. అది మరింత ప్రమాదంగా పరిణమిస్తుంది. అలాంటిచోట నుంచి శాస్త్రజ్ఞులను, విజ్ఞానావిష్కరణలను ఆశించటం అత్యాశే అవుతుంది.
- సామాన్యులకు సైతం సైన్సు శక్తి, దాని ఫలాలూ సులభంగానే అర్థమవుతాయి. ఆశ్చర్యాన్ని గొలుపుతాయి. దానికి భిన్నంగా శాస్త్రీయ భావాలను కలగాపులగం చేసే కొంతమంది మేధావులతోనే విజ్ఞాన విస్తృతికి ఆటంకం. సూత్రబద్ధత లేని అంశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి మాట్లాడేవాళ్లు ఇటీవల కాలంలో మరింత పెరిగారు. ఇలాంటి పరిస్థితే భారత సమాజం నుంచి గొప్ప గొప్ప వైజ్ఞానిక ఆవిష్కరణలు రాకపోవటానికి కారణం. ఆలోచన - ప్రశ్న - అన్వేషణ ఒక నిరంతర ప్రయాణంగా సాగేలా పిల్లలను మనం ప్రోత్సహించాలి. ఎల్లలు లేని వైజ్ఞానిక ఆకాశంలోకి పిల్లలను స్వేచ్ఛగా విహరించనీయాలి. కాకమ్మ కథలూ, కల్పనలూ, ప్రయోగాలకు అందని గత కాలపు అతిశయోక్తులూ ... పిల్లలకు చందమామ కథలు కావాలి తప్ప- శాస్త్రీయ ఆలోచనను దెబ్బ కొట్టే చట్టుబండలు కాకూడదు.

# దృశ్య మాధ్యమం
# బలమూ... బలగమూ..

'సోషల్' స్మార్ట్



**పుస్తకాలు అనుభవాలను పంచితే... దృశ్యం అనుభవాలను కళ్లకు కట్టినట్లు చూపుతుంది. మూడు వందల పేజీల పుస్తకాన్ని చదివితే వచ్చే స్ఫూర్తి కేవలం పది నిమిషాలు వీడియోను చూడటం వల్లనో, రెండు గంటలు సినిమాను వీక్షించడం వల్లనో కలుగుతుంది. దృశ్యానికి ఉన్న లక్షణం అటువంటిది. హావభావాలతో, డైలాగులతో, కంటికి కనపడుతూ, మెదడును ఆలోచింపచేస్తూ సాగే దృశ్యం ఏర్పర్చే ప్రభావమూ ఎక్కువే! ఈ బలమైన లక్షణం వల్లే నేడు సామాజిక మాధ్యమాల్లో రోజురోజుకి కొత్త ఛానెళ్లు పుట్టుకొస్తున్నాయి. ఎందుకంటే - దృశ్యమాధ్యమం ఇప్పుడొక శక్తివంతమైన ఆయుధం.. సాధనం. బలహీనులకు కూడా కొండంత బలమూ, బలగమూ...**

ప్రపంచంలో ఎక్కడి అనుభవం అయినా మనం ఇంట్లోంచే పంచుకోవొచ్చు. మన సలహానో, సూచననో, అభిప్రాయాన్నో వ్యక్తం చేయొచ్చు. మన మాటలు వినిపించొచ్చు. వంటలు రుచి చూపించొచ్చు. అక్కడి సంగతులు తెలుసుకోవొచ్చు. నెట్ ప్రపంచం ఇప్పుడు దృశ్య సహితంగా ప్రతి విషయాన్నీ మన నంటింట్లో పరిచయం చేస్తోంది. ఇదొక గొప్ప సానుకూల సంగతి అనటంలో ఎలాంటి సందేహమూ లేదు.

### అతిపెద్ద ఛానెల్

నేడు సామాజిక మాధ్యమంలో అతిపెద్ద వీడియో ఎగుమతి అవుతున్న ఛానెల్ యూట్యూబ్. ఇందులో అన్ని రకాల వీడియోస్ ఉంటాయి. దేని గురించైనా సమాచారం కావాలంటే గూగుల్ చేస్తాం. లేదంటే యూట్యూబ్‌లో సెర్చ్ చేస్తాం. వంట ఎలా చేయాలి? ఆన్‌లైన్ ట్రైనింగ్, ఆరోగ్య సమస్యలు, వంటివాటి దగ్గర నుంచి ఫ్యాషన్ల వరకూ కొత్త విషయాలను నేర్చుకోవాలంటే– యూట్యూబే అతి పెద్ద వనరు. షార్ట్ ఫిలిమ్స్ ప్రాచుర్యం పొందాలన్నా, వివిధ అంశాలపై మన వీడియోలు ప్రపంచ వ్యాప్త ప్రజలకు చేరాలన్నా యూట్యూబులోకి ఎగుమతి ఒకటే దారి. అందుకే యూట్యూబ్‌ని యువత అంతగా అనుసరిస్తోంది. ఏదైనా ఒక ముఖ్య నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు మనం ఆలోచనల్లో పడతాం. సమస్య పరిష్కారం కోసం సతమతమవుతాం. ఆ సమస్యను వివరిస్తూ వీడియో చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తే ఎంతోమందికి అది ఉపయోగపడుతుంది. కొంతమంది వీక్షకుల నుంచి మంచి పరిష్కారమో, సూచనో లభించే అవకాశం కూడా ఉంది.

### అవగాహన పెంచే ఛానెళ్లు

ఆన్‌లైన్‌లో ఫుడ్ తయారీ అందుబాట్లోకి వచ్చాక వాటికి మంచి ఆదరణ పెరిగింది. ఎవరో పోస్టు చేసిన వంటలను చూడడమే కాదు; మనకు తెలిసిన మన ప్రాంతపు వంటలను ప్రమోట్ చేసేవాళ్లూ పెరిగారు. ఇలాంటి వీడియోలకు మంచి స్పందన వస్తోంది. అలాగే యూట్యూబ్‌లో చరిత్రను తెలియజేసే వారు... కొందరైతే భవిష్యత్‌పై విశ్లేషణ చేసేవారు మరికొందరు. మూఢనమ్మకాలపై, మూఢాచారాలపై అవగాహన కల్పిస్తున్న వారిలో యువతే చాలామంది ఉన్నారు. యూట్యూబ్ నుంచి ఆదాయం ఎక్కువగా రాకపోయినా ప్రజలను చైతన్యవంతం చేస్తున్న యువత కృషి అభినందనీయమే!

మరోపక్క ఆరోగ్య నిపుణులు సెక్స్ ఎడ్యుకేషన్ కోసం ఓ ఛానల్ ఏర్పాటు చేసి సందేహాలకు సమాధానాలిస్తున్నారు. విషయం ఏదైనా పరిజ్ఞానం చాలా ముఖ్యం. ఏదైనా సంపూర్ణిగా తెలియనప్పుడే తప్పులు జరుగుతాయి. యువతకు అవసరమైన విషయాలపై అవగాహన ఉంటే తప్పుదోవ పట్టే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఉదాహరణకు ఎయిడ్స్ ఎలా వస్తుందో తెలియనివాడే తప్పు చేస్తాడు. అదే దానిపై అవగాహన ఉంటే తప్పు చేయడానికి భయపడతాడు.

### విషం చిమ్మొద్దు

ఇదంతా ఒక కోణమైతే... మరో కోణం దీనికి పూర్తి వ్యతిరేకమైనది. కొందరు వ్యక్తులపై దూషణలు చేస్తూ, అసభ్యకరమైన పదజాలంతో తిడుతూ వీడియోలు చేస్తున్నారు. మతపరమైన, కులపరమైన వీడియోలు చేసి ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే వారూ ఉన్నారు. ఇలాంటి వారు యూట్యూబ్‌లో మాత్రమే కాదు; ప్రతిచోటా ఉంటారు. అత్యధికంగా సినిమా వారిపై విచ్చలవిడిగా విషపూరిత వీడియోలు వస్తున్నాయి. తమ వీడియోలను ఎక్కువ మంది చూడాలని అసత్యాలను ప్రచారం చేస్తుంటారు. ఇలాంటి చౌకబారు పద్ధతుల వల్ల సమాజానికి ఉపయోగం లేదు. పైగా అలాంటి వీడియోలు ఎలాంటి

నమ్మకాన్ని పొందలేవు. కేసు బుక్ చేస్తే సైబర్ క్రైంలో ఇరుక్కునే ప్రమాదం కూడా ఉంది.

అదే విధంగా యూట్యూబ్లో అడల్ట్ కంటెంట్ ఎక్కువగా అప్లోడ్ అవుతోంది. ఇలానే కొనసాగితే యూట్యూబ్ ఓ అడల్ట్ కంటెంట్కి సంబంధించిన మాధ్యమంగా మారిపోతుంది. వీడియోలకు ఇచ్చే టైటిల్స్ దరిద్రంగా ఉంటున్నాయి. సెలబ్రిటీల ఫొటోలు అప్లోడ్ చేస్తూ బ్యాక్గ్రౌండ్లో అడల్ట్ వాయిస్ క్లిప్స్ ప్లే చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో కొత్తగా వచ్చిన కొన్ని యూట్యూబ్ ఛానెళ్ల వారు వ్యక్తిగత జీవితాల్లోకి ఎంటరై, తీర్పులు ఇవ్వటం మొదలెట్టారు. కొందరు మానసిక స్థితి బాగోలేక ఏదేదో మాట్లాడుతుంటే దాన్ని వీడియో తీసి వ్యూస్ కోసం అప్లోడ్ చేస్తున్నారు. ఇలాంటి ఛానెల్స్ పై నిఘా వర్గం దృష్టి పెట్టాలి. పోస్ట్ చేసిన వీడియోపై రకరకాల వ్యక్తులు రకరకాలుగా స్పందిస్తారు. కొందరు ఆ వీడియోకి సంబంధంలేని విషయాలనూ కామెంట్ చేస్తారు, ట్రోల్ చేస్తారు. అలాంటి పనులు చేసేవారికి సైబర్ క్రైమ్ చట్టం వర్తిస్తుంది.

**నిఘా, నియంత్రణ**

కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ ఎస్కార్ట్ సర్వీస్ను అందిస్తున్నాయి. బలమైన నిఘా లేనప్పుడు అలాంటి మాధ్యమాలను మన దేశంలో ప్రోత్సహించకూడదు. లేదంటే బలమైన నిఘా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఓ వ్యవస్థ నుంచి మనకు నష్టాలు ఉంటే వాటిని బహిష్కరిస్తాం. అలాగే ఏ సామాజిక మాధ్యమం నుంచైనా లాభనష్టాలను బేరీజు వేయాల్సింది మన ప్రభుత్వాలే. నష్టాలు ఉంటాయన్నప్పుడు వాటిని ఆపేయాలి. కొన్ని వెబ్ సైట్, పోర్న్ సైట్స్ బ్యాన్ చేసినట్టే నష్టం చేకూర్చే సైట్లను బ్యాన్ చేయాలి. అయితే, ఆ పేరుతో ప్రజాస్వామిక గొంతులను నొక్కేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఛానెళ్లు కూడా తమ వీక్షకులకు, ఫాలోయర్లకు తగిన పరిజ్ఞానాన్ని, వాస్తవాల సమాచారాన్ని ఇవ్వాలి. విచక్షణకు ఎసరు పెట్టే అస్తవ్యస్త కబుర్లను కాక– మెదడుకు పదును పెట్టే నిజాలను నివేదించాలి. అయితే, ఈ ఛానెళ్లు అలాంటి విశాల దృష్టితో, వివేచనతో వ్యవహరిస్తున్నాయో లేదో బేరీజు వేసుకునే బాధ్యత వీక్షకులదే! ఏది మంచి, ఏది చెడ్డ? ఏది వాస్తవం, ఏది కాదు.. వంటి అంశాలు తగిన పరిశీలన జరిపితే– అర్థం కాకుండా పోవు.

**నిందలు తగవు**

స్త్రీ–పురుషుల మనస్తత్వాలను తెలియజేస్తూ సమానత్వం చాటి చెప్పే విధంగా గర్ల్ ఫార్ములా, బాయ్ ఫార్ములా వంటి యూట్యూబ్ ఛానల్ ద్వారా సమస్యలను వాటి పరిష్కార మార్గాలను సూచిస్తున్న యువతను మెచ్చుకోవచ్చు.




వీడియోస్లో వాడే భాష అభ్యంతరకరమైనప్పటికీ అందులో మంచిని మాత్రం తీసుకోవచ్చు. ఉదాహరణకు స్త్రీలు కాస్త లావుగా ఉంటే వారిని లడ్డు, డుంబు, సుమో అంటూ ఇష్టం వచ్చినట్లు పేర్లు పెట్టి వారి భావోద్వేగాలను గాయపరుస్తున్నారు. ఇది అభ్యంతరకరం. ఓ వ్యక్తి శరీరాకృతిని కించపరచడానికి ఎవరికి ఎలాంటి హక్కూ లేదు. వాస్తవానికి ఇది నేరం. దీనినే బాడీ షేమింగ్ అంటారు. హైట్ తక్కువగా ఉంటే పొట్టి బుడ్డంకాయ, ఎక్కువగా ఉంటే తాటిచెట్టు అంటారు. ఆ వ్యక్తి దానిని రిసీవ్ చేసుకుంటే ఫర్వాలేదు. బాధపడేలా మాత్రం చేయకూడదు. అలాగే ఓ అమ్మాయికి ఫ్యాషన్ రంగంలో రాణించాలని ఉందనుకోండి. తల్లితండ్రులు ఆ అమ్మాయి కోరికలు, ఆలోచనలను అర్థం చేసుకోవడంలో విఫలమౌతున్నారు. ఆమెకు ఆసక్తి ఉన్న రంగం కాకుండా ఏ ఇంజినీరు అవ్వటానికో చదువుకోమంటారు. ఆమె ఇష్టంలేని చదువులో నెట్టుకొచ్చినా అందులో రాణించడం కష్టమే! ఆ అమ్మాయికి జీవితం మొత్తం ఖాళీగా ఉన్నట్టు అనిపిస్తుంది. ఇలాంటి అనేక విషయాలపై అవగాహనను, అభిప్రాయాలను నేడు యూట్యూబ్ ద్వారా పొందొచ్చు.

**ఆపన్నులకు అండగా ...**

కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ వివిధ సందర్భాల్లో ఫండ్ రైజ్ చేసి అనాథలకు, వృద్ధులకు, వికలాంగులకు సహాయం అందిస్తున్నాయి. సహాయం చేసిన వీడియోలను అప్లోడ్ చేసి మరింత మందికి స్ఫూర్తిని ఇస్తున్నాయి. చేసే సహాయం స్వార్థపూరితం కానప్పుడు దానిని ఇతరులతో షేర్ చేస్తే మరింత మందికి ప్రేరణగా నిలుస్తుంది. యువత కేవలం డబ్బు సంపాదన, స్వార్థ ప్రయోజనాలే కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. ఏదైనా యూట్యూబ్లో పోస్ట్ చేస్తున్నారంటే ఆ వీడియో వల్ల సమాజానికి లాభమే ఎక్కువగా ఉండాలి. కొన్ని సందర్భాల్లో ఏదైనా సమస్యను రాజకీయ నాయకులకు ట్వీట్ చేస్తే వారు రిప్లై కూడా ఇస్తున్నారు. ఇది మంచి అవకాశమే కదా? అలాగే సోషల్ మీడియా వేదికగా లంచగొండి అధికారులను బట్టబయలు చేస్తున్నారు. ఇలా సోషల్ మీడియా మన చేతుల్లో ఉండే ఓ పెద్ద ఆయుధం. ఆ ఆయుధం ద్వారా సమాజానికి మేలు చేయాలే తప్ప సమాజానికి కీడు చేయకూడదు.

- నిజాగ్ని



కెనడాలోని క్యూబెక్ అందమైన నగరం. ఆకుపచ్చని అడవులు, స్వచ్ఛమైన నీరు, సముద్ర తీరం, తెల్లని మంచు, జలపాతాలు, రకరకాల పక్షులు, జంతుజాలం... వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తాయి. మంచుతో కట్టిన కళాకృతులు, దానికి సంబంధించిన పండగలు పర్యాటకులను అలరిస్తాయి.

యమహా నగరీ

# మంచు నగరం...

❑ కెనడాలో తూర్పు నగరం క్యూబెక్. దీని భౌగోళిక విస్తీర్ణం 15,42,056 చదరపు కిలోమీటర్లు. జనాభా 84 లక్షల మంది. జనసాంద్రత ఒక చదరపు కిలోమీటరుకు ఎనిమిది మంది. ఇక్కడ 149 రోజులు ఒక ఇంచు పేరుకుపోయేంత మంచు కురుస్తూనే ఉంటుంది.

❑ 1523లో ఫ్రాన్స్ రాజు ఆదేశంతో ఇటలీ నావికుడు జాక్వెస్ కార్టియర్ చైనాను కనుగొనేందుకు వెళుతూ అమెరికాలోని ఈ ప్రాంతాన్ని కనుగొన్నాడు. ఫ్రెంచి వారి ఆక్రమణతో ఈ ప్రాంతంలో వారి సంస్కృతి కనిపించడంతో పాటు ఫ్రెంచి భాషను ఎక్కువగా, ఇంగ్లీషు తక్కువగా మాట్లాడతారు.

❑ ప్రపంచంలోనే అత్యంత స్వచ్ఛమైన నీరు ఇక్కడ లభిస్తుంది. దాదాపు 4,500 నదులు ఉన్నాయి. ఇవి సెయింట్ లారెన్స్ గల్ఫ్ ద్వారా ఆర్కిటిక్ మహాసముద్రంలో కలుస్తాయి. ఇక్కడి కాన్యపికా రిజర్వాయర్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రాంతపు మిస్తాస్సిని కాలువ అతిపెద్దది.

❑ ఈ ప్రాంతంలో ఎక్కువగా జింకలు, రేన్‌డీర్లు, మూస్‌లు, మస్క్ ఆక్స్, కారిబో, అమెరికన్ బ్లాక్ డీర్, పోలార్ బేర్ వంటి జంతువులు కనిపిస్తాయి.

❑ టండ్రా, టైగా, బొరియల్, ఆకురాల్చే అడవులు ఉంటాయి. మూడొంతుల క్యూబెక్ ప్రాంతమంతా బొరియల్ అడవులు వ్యాపించి ఉన్నాయి. ఇక్కడ పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగుల ఆకులతో కూడిన పెద్దపెద్ద చెట్లు, అందమైన 150 రకాల పక్షులు ఉంటాయి. వాటిలో పిచ్చుకలు, అమెరికన్ రాబిన్, బ్లూ జాయ్, కాకులు, స్వాలోస్, మల్లార్ట్‌లు వంటి అనేకరకాలైన పక్షులను చూడవచ్చు. మంచు గుడ్లగూడ రాష్ట్రీయ పక్షి.

❑ సెయింట్ లారెన్స్ నది ఉత్తర అమెరికాలోనే పెద్దది. దీని పక్కనే ఉన్న 'చాట్యూ ఫ్రాంటినాక్ హోటల్' ప్రపంచ ఫొటో గ్రాఫిక్ హోటల్‌గా పేరుపొందింది. ఈ ప్రాంతంలో బాగా ప్రసిద్ధి చెందిన వాటర్ ఫాల్స్ 'మోంట్‌మోరెన్సీ ఫాల్స్'.

❑ 'అక్వేరియమ్ డు క్యూబెక్'లో దాదాపు 10 వేల క్షీరదాలు, రకరకాల చేపలు, పోలార్ బేర్స్, సీల్స్ ఉంటాయి. అబ్రహం మైదానంలోని 'బాటిల్‌ఫీల్డ్ పార్క్'లో ప్రత్యేకించి యుద్ధసామగ్రి, 50 రకాల చారిత్రక పరికరాలు ఉన్నాయి. దీనిపై నుంచి జాన్ ఆఫ్ ఆర్క్ స్టాట్యూ, మార్టెల్లో టవర్లను చూడవచ్చు.

❑ ప్రతి ఏటా ఫిబ్రవరిలో మూడు వారాల పాటు కార్నివాల్స్‌ను ఏర్పాటు చేసి, పిల్లలకు, పెద్దలకు ఐస్‌తో రకరకాలైన గేమ్స్, మంచు శిల్పాలను చెక్కడం వంటి పోటీలు నిర్వహిస్తారు. ఈ పండుగకు 'బన్‌హోమ్మి' అనే మంచు మనిషి మస్కట్‌ను 2011 నుంచి ఏర్పాటు చేశారు. ఈ వేడుకలు ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందాయి.

❑ మంచు శిల్పాలతో నిర్మించిన హోటళ్లు అందరినీ ఆకర్షిస్తాయి. 30 వేల టన్నుల మంచు, 500 టన్నుల ఐస్‌ను ఉపయోగించి వీటిని కడతారు. దీనిని నిర్మించడానికి ఆరువారాల సమయం పడుతుంది. అయితే ఏటా కొత్త కొత్త మోడల్స్‌లో వీటిని కడతారు. ఐస్‌తో చేసిన గ్లాసుల్లోనే సర్వ్ చేయడం ఇక్కడి ప్రత్యేకత. వేసవిలో మ్యూజిక్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహిస్తారు.

❑ స్థానికులు ఎక్కువగా స్నేహితులతో, వారికిష్టమైన వారితో కాఫీ తాగటమో, భోజనమో చేయడానికి ఇష్టపడతారు.

❑ ఇక్కడి వారు ఇతరులపట్ల స్నేహభావంతో ప్రవర్తిస్తారు. క్లిష్టసమయాల్లో కూడా ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించరు. బీఫ్‌తో చేసిన 'టార్టెర్', పీ సూప్, పోటైన్ అనే గ్రేవీ కూరను తింటారు. స్కర్ట్స్, షాట్స్, జీన్స్ ధరించడం, ఫుట్‌బాల్, ఐస్ హాకీ, రగ్బీ ఆటలు ఆడటానికి ఇష్టపడతారు.

❑ ఈ ప్రాంతపు పిల్లలు ఎక్కువగా వీడియో గేమ్స్ ఆడుతుండటంతో 'అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌రాక్టివిటీ డిసార్డర్' (ఎడిహెచ్‌డి) అనే వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయమై నేషనల్ అసెంబ్లీలో చర్చించేందుకు ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేశారు. దీని నివారణకై పాఠశాలల్లో ఉదయం, మధ్యాహ్న సమయాల్లో 20 నిమిషాల బ్రేక్ ఇచ్చి పిల్లలు తప్పనిసరిగా ఆడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పాఠశాల సమయాల్లో వాడకూడదనే నిబంధన పెట్టారు.

❑ ఈ ప్రాంతంలో ఉద్యోగాలు ఎక్కువ మనుషులు తక్కువ ఉండటంతో ఇతర ప్రాంతాలవారికి మంచి అవకాశాలు ఉంటాయి.

- సోనూ




జపాన్‌లో ఉన్‌కాయ్


ఆకాశంలో ఆకుపచ్చని కిరీటంలా ...రోరయిమా పర్వతం

నార్వేలో సెంజా

కొడైకెనాల్

# తెల్లని మబ్బుల

మనిషి ప్రకృతి పిపాసి. ప్రకృతి మనిషికి ప్రేరణ ఇస్తుంది. ప్రశాంతతను ఇస్తుంది. ఊహనిస్తుంది. ఊతమవుతుంది. స్పందింపజేస్తోంది. సాధనకు తోడ్పాటవుతుంది. కవులకు వస్తువవుతుంది. కలానికి బలమవుతుంది. ప్రేమికులకు ఆహ్లాదమవుతుంది. మనసున వెల్లువై పల్లవిస్తుంది. అందుకనే రోజువారీ పనుల్లో అలసిసొలసిన మనిషి విరామం కోసం, విశ్రాంతి కోసం, సరికొత్త ఉత్సాహం కోసం ప్రకృతి ఒడిలో వాలిపోవటం సర్వసాధారణం. రెక్కలు కట్టుకొని ఎక్కడెక్కడికో ఎగిరిపోవటం సహజం. మనిషి సేద తీరాలంటే విశ్రాంతిని తీసుకుంటాడు. మరి మనసు సేద తీరాలంటే అప్పుడప్పుడు ప్రకృతి అందాలను వీక్షించేందుకు విహరించాల్సిందే..! ప్రకృతి ఒడిలో మనసు ఊయలలూగాల్సిందే..! మరి ప్రపంచంలో ఎక్కడెక్కడ ఎలాంటి ప్రకృతి పరవశాలు ఉన్నాయో చూసొద్దామా?

## పర్వతరాజంపై పరవశం

వెనిజులాలోని 'రోరయిమా పర్వతం' ఓ గొప్ప అనుభూతిని మిగిల్చే సందర్శనా స్థలం. అక్కడ పర్వత దృశ్యాలు పర్యాటకులకు ఎంతగానో అలరిస్తాయి. ఆ పర్వతం ఎత్తు 2,734 మీటర్లు. దాని ఉపరితలం చదునుగా ఉండటమే ఓ ప్రత్యేకత. దాని ఆనుపానులు తెలియని కాలంలో స్థానికులు దానిని భయానకమైన పర్వతంగా భావించేవారట. మేఘాలు ఎందుకు అంత దగ్గరగా ఉంటాయన్న విషయం తెలుసుకున్న తర్వాత ఆ ప్రాంతానికి వెళ్లడం ప్రారంభించారు. మేఘాల మధ్యలో ఆ పర్వతం ఎంతో ఆకర్షణీయంగా నిలుస్తోంది. అక్కడకు వెళ్లే సందర్శకులు ఆ దృశ్యాలను ఫొటోల రూపంలోనే కాకుండా హృదయాల్లోనూ బంధించుకుంటారు. ఆ పర్వతం ఎక్కడం ఓ గొప్ప అనుభూతినిస్తుంది. ఆ పర్వతం పైనుంచి చూస్తే చిక్కటి మేఘాలు పరుగులు తీస్తున్నట్లు కనిపిస్తాయి. మబ్బుల మధ్యలో పర్వతం దాక్కునట్లనిపిస్తుంది. అక్కడ నుంచి చూస్తే కొండల మీదుగా జారే జలపాతాలు కనువిందుగా కనపడతాయి. ఆ ప్రాంతంలో జంతుజాలానికి సంబంధించిన పరిశోధనకోసం శాస్త్రవేత్తలు వెళుతుంటారు. ఆసక్తిపరుల కోసం అక్కడ ప్రత్యేకంగా హెలికాప్టర్లు ఉంటాయి. ఆ ప్రాంతాన్ని ఓసారి సందర్శిస్తే జీవితకాలం అనుభూతిని మిగిలిస్తుంది.

## నింగి నడుమ మేఘాల కడలి

జపాన్‌లోని ఉన్‌కాయ్ పర్వతం పైనుంచి వీక్షిస్తే మేఘాలు సముద్రపు అలల దొంతర్లను తలపించేలాగ వ్యాపించి ఉంటాయి. మేఘాల మధ్య ఉండే పర్వతాలు దీవులను తలపించేలాగ కనపడతాయి. అక్కడ మేఘాలు తెల్లవారుజామున కురిసే మంచులాగ మెల్లగా వెళ్తుంటాయి. ఆ ప్రాంతం శీతాకాలంలో సందర్శించడానికి అనువుగా ఉండటంతో 'ఐస్ విలేజ్' అని కూడా పిలుస్తారు. అక్కడ సందర్శకులు ఉండేందుకు ప్రత్యేక రిసార్టులను ఏర్పాటుచేశారు. తోమమూలో హోషినో రిసార్టు ప్రత్యేక వసతులతో ఉంటుంది. తోమమూ పర్వతం చుట్టూ, హిడాకా, ఉన్‌కాయ్ పర్వతాలతోపాటు మరికొన్ని చిన్న పర్వతాలు ఉన్నాయి. ఉన్‌కాయ్‌లో హోషినో రిసార్టు 1,008 మీటర్ల ఎత్తులో ఉంటుంది. దానిని 'ఉన్‌కాయ్ టెర్రస్' అంటారు. అక్కడ ఉండే రిసార్టుల్లో కాఫీ గింజలను పండిస్తారు. ఆ తోటలో నడకదారిన వెళితే ఎంతో ఆహ్లాదకరమైన అనుభూతి కలుగుతుంది. సాహసకారులు మాత్రమే ఆ పర్వతంపైకి ఎక్కేందుకు ఆసక్తిచూపుతారు. ప్రకృతి అందాలకు ఆ ప్రాంతం చూడచక్కటిది.

★ మేఘాలు కేవలం నీటి ఆవిరి వల్ల తయారవుతాయి. కానీ, నిజానికి నీటి ఆవిరి కొన్ని క్షణాల్లోనే మాయమైపోతుంది. మనచుట్టూ ఉండే గాలిలో దుమ్ము, ధూళి కణాలతోపాటు చిన్న చిన్న నీటి బిందువులు ఉంటాయి. అనేక నీటి బిందువులు ఒకచోట కలిసి వాటికి గ్యాస్ తోడై మేఘాలుగా ఏర్పడతాయి. గాలిలో నీటి ఆవిరి ఎక్కువ ఉండటం వల్ల అది తేమగా ఏర్పడి చర్మానికి జిడ్డును కలిగిస్తుంది. గాలిలో నీటి ఆవిరి తక్కువగా ఉన్నప్పుడు వాతావరణం పొడిగా ఉండటం వల్ల చర్మానికి జిడ్డు పట్టదు.

★ ఓ పర్వతం పైకి వెళ్లేకొద్ది గాలిలో వచ్చే మార్పులు మన శరీరానికి స్పష్టంగా తెలుస్తుంది. శీతాకాలంలో గాలి చల్లబడి గాలిలోని నీటి ఆవిరి ఘనీభవించి అవి మబ్బు రూపంలో కనపడతాయి. ఆకాశంలో మబ్బులు తగినంతగా ఉండి, గాలి చల్లగా ఉంటే మేఘం మంచు స్ఫటికగా మారుతుంది.

★ మేఘాలు తెలుపు, నీలం, బూడిద, ఎరుపు వంటి రంగుల్లో ఉండడానికి

# లోగిళ్లు...


మేఘాల మధ్య మొలకెత్తిన శిఖరం : నార్వేలో సెంజా

చలి కాలపు సవ్వారీ ముగిసి.. ఉక్కపోతల ఎండాకాలం ఏతెంచే తరుణం ఇది. కానీ, వేకువజామున లేచి చూస్తే- పరిసరాలన్నీ మంచుతెరలు కప్పకొని... కళ్లముందు ఓ కమనీయదృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. మంచును చూసి మది పులకరిస్తుంది. దారులన్నీ తెల్లని దారాలతో పెనవేసుకున్నట్టు కనిపిస్తాయి. ఇలాంటి మంచుకురిసే వేళలో... మబ్బులు తారాట్లాడే పర్వత ప్రదేశాల్లో విహరిస్తే - ఎలా ఉంటుంది? చల్లని శీతల గాలులు మేనిని స్పర్శిస్తుంటే.. మంచుబిందువులు మంచి ముత్యాల్లా మురిపిస్తుంటే- తెల్లని మబ్బుల లోగిళ్లను తిలకిస్తే మనసు ఎలా మురుస్తుంది? అదొక ఓ ఆహ్లాదకరమైన, అనిర్వచనీయమైన అనుభూతి కదూ?

విహారం

## మేఘాల వాకిళ్లు

పచ్చని ప్రకృతి శోభాయమానం కొడైకెనాల్. ఆ ంతమంతా వాకిట్లో మేఘాలు వెదజల్లి ఉంటాయి. కాశం, మబ్బులు ఒకే చోట తారాడుతుంటాయి. ఇది మిళనాడులో కొడైకెనాల్ ఓ కొండ నగరం. అక్కడ ఎక్కువగా నైట్ శిఖరాలు, అటవీ లోయలు, సరస్సులు, జలపాతాలు, కొండలతో నిండి ఉంటుంది. సముద్రమట్టానికి రెండు మీటర్ల ఎత్తులో ఉన్న ఆ పట్టణం కొడైకెనాల్ సరస్సు ట్టూ నక్షత్ర ఆకారంలో ఉంటుంది. పడవలను అద్దెకు ుకుని జంటలుగా విహారానికి వెళ్తుంటారు. ఆకాశాన్ని ుకుని ఉన్నట్లుగా ఉండే పళని పర్వతం చూడదగ్గ ంతం. ఇది పారాపార్, గుండార్ లోయల మధ్య 2,133 టర్లు ఉంటుంది. ఆ లోయంతా మల్లె వంటి తెల్లని ఘాలతో కప్పుకుని ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఆ కొండలు శ్చిమ కనుమల తూర్పుతీరంలో దిండిగల్ జిల్లాలో న్నాయి. అత్యంత ప్రసిద్ధి చెందిన వృక్షాలు, పండ్ల చెట్లు, ద్యానవనం సందర్శించదగ్గవి. ఆ కొండ ప్రాంతమంతా పసుపుపచ్చని వ్వులతో నిండి ఉంటుంది. అక్కడే లిల్లీలతో నిండి ఉన్న చెరువు కర్షణీయంగా కనువిందు చేస్తుంది. పశ్చిమాన ఉన్న మంజంపట్టి లోయ, దిరాగాంధీ నేషనల్ పార్కు, అన్నామలై పర్వతాలు సందర్శకులను ఎంతో కట్టుకుంటాయి.

## చందమామ సన్నిధిలాంటి అనుభవం

చిన్నప్పుడు అమ్మ చెప్పిన కథల్లో చందమామ గురించి తెలుసుకుని కాశంలోకి చూస్తూ అనుభూతిని చెందివుంటాం. కానీ, స్వయంగా ందమామ దగ్గరకు వెళ్లిన భావనను కలిగిస్తుంది నార్వేలోని సెంజా ర్వతం. ఆ పర్వతపు అంచున నిలుచుంటే చల్లని మబ్బులు కాళ్లను కుతూ గిలిగింతలు పెడుతుంటాయి. గాల్లో మబ్బులను చూస్తుంటే టికి కనపడే దూరంలో ఉన్న కొండలు మబ్బుల్లో మునిగిపోతున్నట్లు బడతాయి. దేశ దేశాలనుంచి ఆ అందాలను చూసేందుకు ప్రకృతి మికులు అక్కడకి వెళ్తుంటారు. అక్కడ ఆకాశ విహారం, ఫిషింగ్, ట్రేసింగ్, గ్లైడింగ్, ట్రెక్కింగ్ వంటివి ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. యువతీయువకులు ంజా పర్వత శ్రేణులను అధిరోహించేందుకు ఇష్టపడుతుంటారు. ఘాలను ముద్దాడే పర్వతాల మధ్య.. మంచుతెరల పరవశాల మధ్య ర్యటించటమంటేనే- ఓ జీవిత కాల మధురానుభూతి కదా?

– వర్ధని

రణం నీటితో నిండిన మేఘంపై సూర్యరశ్మి పడి కాంతి పరావర్తనం చెందటమే! శీతల ంతాల్లో మేఘాలు పూర్తిగా తెలుపులోనే కనపడతాయి.

వాతావరణంలోని పొరల్లో సిర్రోకుములస్, సిర్రస్, కుములోనింబస్, స్ట్రాటస్, ట్రాటోకుములస్, ఆల్టోస్ట్రాటస్ వంటి మేఘాలు కంటికి కనపడతాయి. ఆరు వేల డుగుల ఎత్తున అత్యల్ప మేఘాలు ఉంటే- 50 వేల అడుగుల ఎత్తుకు పైబడి అత్యధిక ఘాలు ఏర్పడతాయి. వాతావరణంలో గాలితోపాటు మేఘాలు ప్రయాణిస్తుంటాయి. న్ని సార్లు భూమి మీద గాలి లేకపోయినా సిర్రస్ మేఘాలు ఎక్కువ ఎత్తులో ఉండి మలుతూ కనపడతాయి. కొండలపై ఏర్పడిన లెంటిక్యులర్ మేఘాలు, బలమైన గాలి చినా స్థిరంగానే ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ఉండే గాలిని బట్టి మేఘాల కదలిక ంటుంది. అందుకే మేఘాలు దట్టంగా, పొగరూపంలో, సన్నని జల్లులాగ, రలరూపంలో రకరకాలుగా కనపడుతుంటాయి.


వెనిజులాలో రోరయిమా పర్వతం

# మంకెన రంగు

- వనజ తాతినేని

99859 81666

ఇంటి వెనుక నుండి మొదలయ్యే అడవి. పేరుకు అడవే కానీ, ఒక పచ్చని చెట్టు కూడా కనబడని ఆరుబయలు. చిన్న చిన్న చిట్టీతి పొదలు బొమ్మేడు, చిట్టికీసర చెట్లు. గట్టి ఎర్రటి నేల. చిన్న గాలికే నేల దుమ్మురేగి చెట్ల ఆకులు కూడా జేగురు రంగు వేసుకున్నట్టు ఉంటాయి.

ఆ కొండంచు పల్లెలో గుట్టల మధ్య నిలువుగా పెరిగిన చిట్టి కీసర కొమ్మలని వంకీ కట్టిన కర్రతో లాగి తన దగ్గర ఉన్న తాడుతో ముడేసి నేలబారుకి వొంగేలా లాగి.. మళ్ళీ అదే చెట్టు మొదలకి ముడేసింది. ఆకులని తింటున్న మేకల మందని చూస్తూ పక్కనే వున్న పెద్ద రాతిపై కూర్చుని ఎక్కడో ఆలోచిస్తూ కూర్చుంది సోనా. పిల్లిలా శబ్దం కాకుండా ఎటు నుంచి వచ్చాడో భూక్యా మోకాళ్ళ మీద నేలపై కూలబడి సోనా కాళ్ళు పట్టుకుని 'నన్ను మాఫ్ చేసినాని చెప్పు సోనా, మళ్ళీ లగ్గం చేసుకుని నీకు చాలా అన్యాయం చేసినా. వోలి కింద యిచ్చిన పశువులని కూడా తిప్పి తోలుకొచ్చుకున్నా.. వొక్క మాట అనలేదు మీ అమ్మ బాపు. ఇంట్లో పని, మడిలో పని అన్నీ నీ చేత చేయిస్తున్నా అని కుమిలిపోతుండా. అది రాచ్చసి ముండ. నీ యెంక చూసినా వూరుకుంటల్లే. దాని నోటికి ఝడిసి కుక్కిన పేనల్లే పడి వుండాను గానీ ఇంటికి అసలైన లచ్చిమి ధేవి.. నువ్వే! నువ్వు నా వైపు చూసి చిన్న నవ్వైనా నవ్వనిదే నేనెట్టా బతకనే సోనా!' అంటూ ఆమె ఒడిలో తల పెట్టాడు. కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూస్తూ భర్త తలపై ప్రేమగా చేయి వేయబోయి క్షణంలో మనసు మార్చుకుంది.

మోసకారికి మాటలకేమి కొదవ. మాట మాటకి రంగులద్దటమే కదా! అని అనుకుంటుండగానే మరిన్ని మాటలు చెపుతూ ఆమె ఒళ్లో నుంచి లేచి నడుము చుట్టూ చేతులు బిగించి 'లేత కొబ్బరి లాంటి నిన్నువొదిలి ముదురు ముంజెలాంటి దానితో సర్దుకోవాల్సి వస్తుంది. నువ్వు వూ అనవే సోనా! దాన్ని బయటకి తోలేస్తా' అన్నాడు మోహంతో. సోనాకి గొంగళి పురుగు పాకినట్టైంది. రెండు చేతులతో అతన్ని విసురుగా వెనక్కి నెట్టేసి లేచి బిరబిరా పోయి కొమ్మలందక మే..మే.. అని అరుస్తున్న మేకపిల్ల ముందుకి కొమ్మని లాగి చివురలందిస్తుంటే... 'ఎన్నాళ్ళు వొంటిగా పడి వుంటావ్, మొగుడ్ని కదా..! ముద్దు మురిపం తీర్చుదామనుకున్నా నన్నే కాదంటావా? ఛీ కొడతావా, బాడ్కోవ్ దానా..! యింటికి రావే, నా కొడుకుని అంటుకోవే.. నీ పని చెపుతా' అని కొట్టడానికి మీదకి వచ్చాడు భూక్యా. అంతలో ఇంటెనుక నుంచి 'ఓయ్..' అంటూ చేతులూపుతూ కేకలు పెడుతన్న రుక్కుని చూసి తోక జాడించి మెల్లగా జారుకున్నాడు. భూక్యా వెళ్ళిన వైపే చూస్తూ సన్నగా నవ్వుకుంది సోనా.

ఆ రాత్రి చిన్నింటిలో పడుకున్న సోనా దగ్గరికి మళ్ళీ వచ్చాడు భూక్యా. ఆమెపై అధికారంగా చెయ్యేసాడు. తోసేసి మంచం దిగి లేచి నిలబడింది. నిద్రపోతున్న పిల్లాడిని ఎత్తుకుని 'నన్ను అంటుకోనీయకపోతే ఈడిని నువ్వు అంటుకోడానికి ఈల్లేదు. నాకే కదా కన్నావ్ యెవరికో కనలేదు కందా' అన్నాడు ఓ ముతక మాటని వదులుతూ. చెరుకాకు సర్రున కనురెప్పపై కోసినట్టైంది సోనాకి. వెనక నుంచి భూక్యా చొక్కా పట్టుకుని గుంజి గుమ్మానికి అడ్డంగా నిలబడి 'నా బిడ్డనియ్' అని లాక్కోబోయింది. చూరు కింద గోడమేకుకి తగిలిచ్చిన పలుపుతాడు తీసుకుని సోనాని గొడ్డుని బాదినట్టు బాది 'నీ బిడ్డ అంట, బిడ్డ! నువ్వేమన్నా పుట్టింటి కాడనుంచి తీసుకొచ్చినావా, సూది దారమే గంద తెచ్చింది.. అది తీసుకుని పోవే' అని వీధిలోకి నెట్టి తడిక బిగగట్టుకుని డాబా ఇంట్లోకి పోయాడు. పక్కలవాళ్ళు చోద్యం జూసినంత సేపు జూసి ఆ ఇంట్లో గోల మనకెందుకులే అనుకుని మెల్లగా టీవీల ముందుకి సర్దుకున్నారు. రెండు గంటలు గడిచిపోయాయి. సినిమాకి పోయిన రుక్కు తిరిగొస్తూ వీధిలో పడున్న సోనాని దాటుకుని ఏమి ఎరగనట్టు ముందుకుపోయింది. పలుపుతాడు దెబ్బలకి

ఒళ్ళంతా పొంగింది సోనాకి. జ్వరం ముంచుకొచ్చింది. నోరు పిడచగట్టుకు పోతోంది. ఎవరన్నా నీళ్ళు ఇవ్వకపోతారా.. అన్నట్టు చూస్తూ ఉంది. ఊరంతా సద్దుమణిగింది కానీ, గొంతులో చుక్క నీళ్ళు పడలేదు. ఆకాశంలో చంద్రుడికి మల్లే నడీధిలో సోనా. లోపల్నుంచి కృష్ణుడి ఏడుపు ఆగకుండా వినొస్తోంది. దాంతో జతచేరి భూక్యా కీచురు గొంతు. 'ఆపరా ముండ నా కొడకా..! ఎప్పుడు చూసినా గీ అని ఏడుస్తూనే వుంటాడు' అని విసుక్కుని 'ఈడిని తీసుకుపోయి దాని వొళ్లో వేసిరా పో' అన్నాడు. ఆ మాట ఎప్పుడంటాడా అని కాస్కుకూర్చున్న రుక్మిణి కృష్ణుడిని ఎత్తుకుని సోనా దగ్గరికి వచ్చి 'చెల్లీ, ఇదిగో బిడ్డ ఏడుస్తున్నాడు.. పాలిచ్చి పడుకోబెట్టు. అయినా నువ్వు భర్తకి ఎదురు చెప్పడమెందుకు, ఇన్ని దెబ్బలు తినుడు ఎందుకు, గుట్టుగా సర్దుకుని వుండొచ్చు గంద. నాకేమన్నా పిల్లా జెల్లా పుట్టునా..! ఇల్లు పొలానికంతటికీ నీ బిడ్డే వారసుడు గందా..! లోపలికి వచ్చి కాస్త ఎంగిలిపడి సర్దుకుని పడుకో, ఆవు ఎద్దై వొకటే అరుస్తా వుంది. పొద్దున్నే హాస్పిటల్కి తోలుకుపోవాలి, నీళ్ళు మోయాలి. యెట్టా చేస్తావో ఏమో?' అని లోపలికి పోయి గది తలుపేసుకుంది. బిడ్డనేసుకుని లేచొచ్చి మళ్ళీ కుక్కి మంచంలో కూలబడింది సోనా.

మర్నాడు పొద్దున్నే ఆవుని ఆంబోతు ఉన్నకాడికి తోలుకుపోయి దాటించుకుని వచ్చింది. బిడ్డని వీపుకు గట్టుకుని పెద్ద ప్లాస్టిక్ సీసాల నిండా నీళ్ళు నింపుకుని వాటికి తాడు గట్టుకుని భుజాన వేసుకుని పాడి ఆవుని ఎద్దులని తోలుకుని చేను వైపుకి పోయింది. కానుగ కొమ్మకి ఉయ్యాల కట్టి బిడ్డని అందులో వేసింది. పాడి ఆవుని చెట్టుకి కట్టేసి గడ్డి వేసింది. నాగలి కట్టి మడి దున్నుతూ దూరంగా వస్తున్న మనిషిని చూసి సంబరపడింది సోనా. దుక్కి ఆపి ఎదురెళ్ళింది. 'అన్నా' అని వాటేసుకుని ఏడ్చింది. ఇంత దూరం యెట్లా నడిస్తివి. మధ్యాహ్నంకి నేనే ఇంటికి వస్తును గందా' అంది. 'అబ్బ ఈ కొండ కింది తండా యింత దూరం వుంటదనుకోలేదు చెల్లి. చెల్లెలు కొడుకని, పొలాలు వున్నాయని ఇంత దూరం నిన్నిస్తాడనుకోలేదు బాపు. ఈ అడివిలో పడి మూఢాచారాలలో మగ్గుతా వుంటివి. మీ పక్కింటి వాళ్ళు రోజూ అమ్మకి ఫోన్ చేసి నీ కష్టాలు చెపుతావుండే. నువ్వేమో పెదవిప్పి చెప్పకపోతే యెట్టా. నీ వరస నచ్చలేదు చెల్లీ..! నువ్వు వూ అంటే.. ఆడ్ని మూడు చెరువులు నీళ్ళు తాగిచ్చి నీ బిడ్డనీ నిన్ను యీడ నుండి తప్పించి తీసుకునిపోతాను' అన్నాడు మురళి.

'అన్నా, వేలు మనదే కన్ను మనదే కదన్నా. రెండో పెళ్ళి చేసుకునే రోజు పెద్ద మనుషుల ముందు వొప్పుకున్నా కదన్నా. పెద్దమ్మవారు నెత్తిమీద కూకుని అట్టా వొప్పుకునేలా చేసింది. వొప్పుకునేదాకా యెన్ని దినాలు నస పెట్టినాడని. నిలుచున్నా కూకున్న పండున్నా ఆఖరికి గుడికి పోయినా పక్కపక్కనే చేరి.. రాగి సంకడిలో చికెన్ ముక్కని తిన్నట్టు మెదడుని నంజుకు తిన్నాడు. ఉప్పలమ్మ కోపం వచ్చి ఇల్లు మొత్తాన్ని జీవాలని వూడ్చి పెట్టేసింది. ఒక్కసారే అమ్మ నాయనని కాటికి చేర్చాను. వొంటిగాడిని అయిపోయాను. ఆ దోషం పోవాలంటే మాశిమ్మని పెండ్లాడాలని, లేకపోతే పుట్టబోయే బిడ్డకి కూడా కీడు జరుగుద్ది' అని గణాచారి చెప్పాడంట. అట్టా చెప్పి చెప్పి నాచేత వొప్పించాడు' అని తన బతుకు బుగ్గయిన తీరుని చెప్పింది.

'రుక్కు ఆ గణాచారి చెల్లెలేనంట కదమ్మా. బావకన్నా వయసులో చాలా పెద్దదంట కదా!'

'యేమో అన్నా! అవన్నీ నాకంత తెల్వ' అంది తలదించుకుని. కాడి వదిలేసి బిడ్డని చంక నెత్తుకుని పశువులని తోలుకుని యింటికి వచ్చారు అన్నా చెల్లెలు.

'అబ్బో .. లగ్గమయిన మూడేళ్లకి గాని బావని చూడను కుదిరిందే నీకు!' అన్నాడు భూక్యా మంచం పైనుంచి లెగవకుండానే. 'చేసే వుజ్జోగం అట్టాంటిది బావా! చెల్లి పెళ్లికే నేను రాలేకపోతిని గందా! అయినా, నువ్వేమన్నా కొత్తోడివా యేంటీ?' అన్నాడు.

'మా పెండ్లికి నువ్వు లేవు గందా, నీకేమి తెలుస్తాది ఇక్కడ ఏం జరిగిందో? మీ చెల్లిని మేనమామ కొడుక్కి చేయాలనే గందా లగ్గం పెట్టితిరి. ఆడేమో లగ్గం రోజుకి మొహం తప్పించే, ఎక్కడోచెట్టుకి ఉరేసుకుని చచ్చిపోయే నీ చెల్లిని చేసుకోవడం యెందుకిష్టం లేకపోయిందో యెవరికి యెరుక. సమయానికి నేను అక్కడుండబట్టే మా అమ్మ కోరింది.. దీన్ని చేసుకోమని. నీ చెల్లెలిది ఇనపపాదం. ఎక్కడ పాదం పెడితే అక్కడ నాసినం అయిపోద్ది. నీ చెల్లెల్ని లగ్గమాడేకే మాకు కష్టాలు వచ్చిపడ్డాయి. గత్తరొచ్చి మందంతా చచ్చినట్టే మా అమ్మ నాన్న చచ్చిపోయిరి' అన్నాడు.

'తాగేనీల్లు బాగోక డయేరియా వచ్చి చచ్చిపోతే మధ్యలో నా చెల్లెలు యేం చేసింది బావా? అయినా ఆ దినాల్లో మీ వూర్లో చాలామంది చచ్చిపోయారు కదా! తండాల్లో వాళ్లకి చెప్పినట్టు నాకు కథలు చెప్పకు. ఈ కథలు చెప్పి నా చెల్లికి చాలా అన్యాయం చేసావు నువ్వు. ఆ ఉసురు గొట్టుద్ది నీకు.'

'చెల్లిని చూడటానికి వొచ్చావా, పంచాయితీ పెట్టను వొచ్చావా? అంత కష్టమనిపిస్తే నీ చెల్లిని తీసుకుని పో..! నా కొడుకుని మీకియ్య. ఏమేవ్, రుక్కు, సూది దారం, మొత్త ఇటు పడెయ్యి. ఈ సాతాను దాన్ని అన్న తోడ్కొని పోతాడంటా అని కేకేసాడు. రుక్కు సోనాకి పెండ్లి నాడిచ్చిన సూదులు దారాల పూసల డిబ్బీ, మెత్త తీసుకొచ్చి అరుగుమీద పెట్టి కృష్ణుడిని ఎత్తుకుని లోపలికి పోయింది.

'వద్దన్నా, నా రాత ఇట్టా అని సర్దుకుంట. బిడ్డని వొదిలి నేనుండలేను. నేను పోతే నీళ్ళు మోసేదానికన్నా పనికొచ్చిది అని రుక్కుని వొప్పించి ఇంకోదాన్ని లగ్గం చేసుకుంటాడు. ఆడిబుద్ధి అంతే'

'రుక్కు మీద కూడా మోజు తీరిపోయిందమ్మా ఆడికి. పోనీ వాడితో అప్పుడప్పుడైనా సర్దుకోమ్మా, నీ కష్టాలు తగ్గుతాయి' అన్నాడు.. చెల్లి కళ్ళలోకి నేరుగా చూడకుండా.

'నిలువునా పేణమన్నా తీసుకుంటా కాని వాడికి వొగ్గి యింకా బిడ్డలని కనీయలేనన్నా. ఆ తండ్లాట కూడా నాకొద్దన్నా' అంది.

'గుదికొయ్యకి దూడని కట్టేసి పాలు పిండుకోడానికి ఆవుని తిప్పుకున్నట్టు నా చెల్లి జీవితాన్నే నీ చుట్టూ తిప్పుతున్నావ్ కదరా! బద్మాష్..' అని తిట్టుకున్నాడు. 'నీ కోసమే ఈ ఫోన్ కొని తెచ్చా. రోజూ అమ్మ బాపుతో మాట్లాడు. నీకేం కష్టం అనిపించినా ఫోన్ చేయి. తెల్లారేసరికి నీ కాడ వుంటా, నేను పోయొస్తా చెల్లీ!' అన్నాడు కళ్ళ నీళ్ళు దాచుకుంటూ. మళ్ళీ తొందరగానే వొస్తానులే.. అని వెనక్కి వెనక్కి తిరిగి చెల్లిని చూసుకుంటూ పోయాడు.

● ● ●

అన్నట్టుగా పదిరోజులకల్లా రానే వచ్చాడు మురళి. బోర్ వేసేవాళ్లని కూడా తీసుకు వచ్చాడు. రెండు చోట్ల దించినా వందల అడుగులోతుకి పోయినా జల జాడ చిక్కకపోయేసరికి ఉసూరుమన్నాడు. 'ఈడ భూదేవి తల్లి కండ్లలో కూడా నీరింకి పోయిందనుకుంటా అన్నా!' అంది నవ్వుతూ. 'నువ్వు ఎట్టా వస్తందమ్మా నీకు?' అన్నాడు విచారంగా.

'చదువుకున్న తెలివితేటలు చూపిత్తారు. ఆ మాత్రం బోర్లు వేయించడం మాకు తెలియకా? అన్నాడు వెటకారంగా భూక్యా. పెద్ద కాలువకి నీళ్ళు వొదిలినంత కాలమూ తండాలో బాయిల్లో నీళ్ళు

ఉంటాయి. ఎండల కాలంలోనే ఇబ్బంది. గొడ్డు గోదా మందకి తాగేదానికి నీళ్ళు కావాలి, ఆడది బిందె పుచ్చుకుని నీళ్ళు మోయాలి.. మగోడు పుల్లరి కాపు కాయాలి, కట్టెల మోపు మొయ్యాలి. మరి ఇంటో పని చేయడానికి మడిసి వుండాలి కదా! అందుకే రుక్మిణి పెళ్ళి చేసుకున్నా అని అర్థం చేసుకోవాలె.. మడి వుంటే మాత్రం మాన్యాలు పండటానికి నీళ్ళు వుండొద్దూ' అన్నాడు భూక్యా.. తానూ ఏమీ తప్పు చేయనట్టు.

చెల్లి తలపై చెయ్యేసి 'ఆ దేవుడే చల్లగా చూడాలి నిన్నూ నీ బిడ్డనీ' అంటూ ఏం చేయలేక గొణిగి కళ్ళు తుడుచుకుంటూ బోర్ లారీ ఎక్కేసి పోయాడు.

మిట్ట మధ్యాహ్నపు ఎండ నిప్పులు చెరుగుతోంది. టింగ్.. టింగ్‌మంటూ చేతి పంపు కొట్టినప్పటి చప్పుడు. 98.. 99.. 100.. అంకెలు లెక్కబెట్టుకుంటూ అలుపొచ్చి ఆగి ధార కింద బెట్టిన బిందెలోకి తొంగి చూసిన సోనా... వూసురుమని నిట్టూర్చి 'దేవుడా! ఆ బిందె నిండటానికి చేతులు నడుము పడిపోయేటట్టు ఇంకెన్నిసార్లు పంపు కొట్టాలో అని విచార పడుతుండగా...

'నిద్ర లేచినదగ్గర్నుండి ఆ పంపుని పట్టుకుని యేలాడతానే వుంటావ్ కదే సోనాబాయీ. ఆ పంపన్నా విరిగింది కానీ, నీ చేతులు యిరగడం లేదు. ఏం మోత, దిక్కుమాలిన మోత. తండాలో నుంచి ఇక్కడిదాకా బిందెలేసుకుని నీళ్ళకి తిరుగుతారు గానీ, పంచాయితీ వాళ్ళని ట్యాంక్ లతో నీళ్ళు పోపియ్యమని అడగరు' అని గొణుక్కుంటూ వచ్చి నిలబడింది లక్ష్మి. 'దిగుడు బాయిలో ఇయ్యాల నీళ్ళే వూరడంలేదమ్మా! ఊరినా బురద బురదగా ఉండాయి. ఆటి కోసమే కొట్టుకుంటా వుండారు. మీరైతే యేమీ అనరని ఇటొచ్చా' వేడుకోలుగా చూస్తూ చెప్పుకుంది. సరేలే, ఇయ్యాలటికి మోసింది చాల్లే, నీళ్ళన్నీ మీరే మోసుకుపోతే మేమైపోవాలి. లక్ష రూపాయలు పెడితే కానీ, నీటిచుక్క తగలడం లేదు. మమ్మల్ని వుద్ధరీయడానికి ఆడ నుంచి ఈడ దాకా వస్తారు. అని నాలుగు మాటలరాళ్ళనేసి గేటు దగ్గరే నిలబడింది... సోనా బిందెలెత్తుకుని బయటకి దాటితే గేటు తాళం వేసుకోవడానికి అన్నట్టు. వెనక చూపులు సూదులు గుచ్చుకున్నట్టు గుచ్చుకుంటుండగా బిందెలనీ కేనులని నింపుకుని పైకెత్తుకుంటుండగా...

'ఎలక్షన్లు వచ్చినప్పుడన్నా గట్టిగా పట్టుబట్టి తండాలో లోతు బోర్లు వేసి వాటర్ ట్యాంకు కట్టించమని అడగొచ్చు కదా! రెండు వందల ఓట్లు వుండాయి. మీ ఆయన వార్డ్ మెంబర్ కూడా.. అడగడానికి కూడా నోర్లు అరువియ్యాలి మీకు' అంటూ విసుక్కుంది లక్ష్మి. 'అమ్మగారు చెప్పింది నిజమే, లేకపోతే నీళ్ళు మోయడానికే యింటికొక మనిషి అవసరపడతన్నారనే సాకు చెప్పి రెండో పెళ్ళాన్ని రాజమార్గంలో తెచ్చుకుంటారు తండాలో మగవాళ్ళు' అనుకుంది సోనా.

• • •

తల మీద రెండు బిందెలు రెండు చేతుల్లో రెండు పదిలీటర్ల ప్లాస్టిక్ కేన్‌లు పుచ్చుకుని తండా వైపు నడక సాగించింది సోనా. తలలోంచి చెమట ధారగా జారుతూ ముక్కు కొస నుంచి కిందికి జారిపడుతూ కొన్ని చుక్కలు పెదాలపై పడుతూ. అప్రయత్నంగా పెదాలని తడుపుకుని ఉప్పగా తగిలిన చెమట చుక్కలని 'ఉఫ్' అని ఊదిపడేసి గబాగబా నడక సాగించింది. మధ్యలో మోటారు బైకు మీద పోతున్న కాలేజీలో చదువుకునే తండా పిల్లగాడు. టీవీలో కనబడే దృశ్యం గుర్తుకొచ్చింది.. గతుకుల రోడ్డుపై కూడా కుండ కింద పడకుండా చుక్క నీళ్ళు చిందకుండా బండిపై సవారీ చేయుడు సులువేమో కానీ, నెత్తి మండకుండా కాలు కాలకుండా చుక్క నీరు యింటికి వచ్చేది కల్ల.. ఈసారి అన్న వచ్చినప్పుడు బండి అన్నా కొనీయమని అడగాల.. ఈ నీళ్ళ మోసుడు తప్పడానికి. అప్పుడు దూరంగా పోయి అయినా బండికి కట్టుకుని నీళ్ళు మోసుకోవచ్చు' అనుకుంది.

వేప చెట్టుకి కట్టేసిన పాడి ఆవు దూరంగా వస్తున్న సోనాని చూసి తలని విదిలిస్తూ లేచి నిలబడి మెడలో పలుపుతాడు లాక్కుంటోంది. ఇంటి పక్కనే వేసిన చిన్న పాకలో కట్టేసిన దూడ కూడా సోనా వైపు ఆశగా చూసింది. ఆ పాక ఎదురుగా ఎండలో నేల మీద కూర్చుని గిన్నెలో వున్న అన్నాన్ని రెండు వేళ్ళతో ఒక్కో మెతుకుని తీసుకుని తింటూ.. మధ్య మధ్యలో చుట్టూ చేరిన కోడిపిల్లలకి మెతుకులు విసురుతూ చిద్విలాసంగా నవ్వుకుంటున్న సోనా కొడుకు కృష్ణుడు. 'అమ్మా భోభోలు భోభోలు' అన్నాడు తల్లిని చూసి. తల్లి కోడి కృష్ణుడి ఎదురుగా నిలబడి ఎట్టా గొట్టా బెదరగొట్టి గిన్నెలో వున్న అన్నాన్ని ఎగజిమ్మి పిల్లలకి పెట్టాలని కాసుకు కూర్చున్నట్టుంది. దూరంనుండే.. 'ఉష్ ఉష్' అంటూ కోడిని పిల్లలని అదిలించి.. చేతుల్లో వున్న నీళ్ళ కేన్‌లని అరుగు మీద పెట్టి గుమ్మం ముందు నిలబడింది. రుక్కు వచ్చి నెత్తి మీద ఉన్న బిందెల్ని దింపడానికి సాయ పడుతుందేమోనని కొంచెంసేపు చూసింది. దర్జాగా పరుపు మంచంపై పడుకుని టీవీ సీరియల్‌లో మునిగిపోయిన ఆమె సోనాని చూడనట్లు నటించింది. మోకాళ్ళు వంచి రెండు బిందెలని జాగ్రత్తగా కిందికి దించి బలంగా ఊపిరి పీల్చుకుంటూ తల మీద చుట్టగా పెట్టుకున్న తుండుని విదిల్చుకుంటూ వెళ్ళి ఎండలో కూర్చున్న కొడుకుని గబుక్కున ఎత్తుకుని చంకలో కూర్చో బెట్టుకుని చెట్టు కిందకి పోయింది. ముఖం తుడుచుకోబోతుండగా కింది పెదవిని ముందుకు నెట్టి.. 'ఫ్ర్ ట్రూ ఫ్ర్ ట్రూ అమ్మా..' అన్నాడు శబ్దం చేస్తూ.

కుండమీద మూతపై బోర్లించిన గ్లాసు తీసుకుని మూత తీసి నీళ్ళు ముంచబోయి ఖాళీగా కనబడిన కుండని చూసి నివ్వెరపోయింది సోనా. గుమ్మంలో నిలబడిన రుక్కు.. 'వొళ్ళు చిట బుడతుంటే ఆగలేక మంచి నీళ్ళ కుండలో నీళ్ళు పోసుకున్నా. మరి ఏం చేయను. గాబులో చుక్క నీళ్ళు లేకపోయే' అంది. 'నడిపెండలో మళ్ళీ బిందెలేసుకుని రెండు మైళ్ళు నడిచిపోవాలి గాబోలు? మనసులో అనుకుంటూ అప్పుడే దించిన బిందెలో నుంచి నీళ్ళు ముంచుకొచ్చి కృష్ణుడుకి తాగించబోతుంటే.. కళ్ళ నుంచి రెండు చుక్కలు గ్లాసులోకి రాలిపడి ఆ నీళ్ళలో కలిసిపోయాయి. ఏ నీళ్ళు అయితేనేం రంగు ఒకటేగా అనుకుంది సోనా.

✦

## కథలకు ఆహ్వానం

**ప్రజాశక్తి** ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా ఉండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా ఉండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా ఉండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

### నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో ఉం డాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో ఉండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. పేరు, పూర్తి చిరు నామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరు నామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

**మెయిల్ అడ్రస్:**

snehaweekly.praja@gmail.com

ooo

# దూరదృష్టి

బాలల కథ

కాకి ఒక్కొక్క గులకరాయి తీసుకుని కడవలో వెయ్యసాగింది.

చెట్టుపైనుంచి ఆ వేడుక చూస్తున్న మరో కాకి 'ఏయ్... ఎందుకంత కష్టపడతావ్? అక్కడ గుడి దగ్గర మనలాంటి పక్షుల కోసం పెద్ద తొట్టిలో నీరు పోసి ఉంచారు.. వెళ్లి తాగవచ్చుగా' అంది.

'ఇంతకుమునుపే అక్కడ తాగి వచ్చాను.' అని చెప్పి, మళ్లీ గులకరాళ్లు కడవలో వేయసాగింది మొదటి కాకి.

'ఆ కాకికి పిచ్చిపట్టింది.' అంటూ పక్కనున్న పక్షులతో చెప్పింది చెట్టు మీద ఉన్న కాకి. పక్షులన్నీ వినోదంగా చూడసాగాయి.

కడవలోని నీరు పైకి వచ్చింది. ఆ కాకి ఆ నీటిని తాగలేదు. వేసిన గులక రాళ్లు తీయడం మొదలుపెట్టింది. అప్పుడు మిగతా పక్షులు కూడా అనుకున్నాయి.. దీనికి నిజంగానే తల చెడిపోయింది అని.

తనకు అందినంతవరకు గులకరాళ్లను తీసిన తర్వాత అలసిన ఆ కాకి మెల్లగా ఎగురుకుంటూ చెట్టు పైకి చేరింది.

'ఏమైంది నీకు ఈవేళ?' అడిగింది పక్కనున్న ఒక పక్షి.

'ఆ కుండ పక్కన ఒక చిన్న మొక్క ఉంది.. చూశావా?' అడిగింది కాకి.

'అవును... అది కనపడుతూ ఉంది.'

'అది ఎలా వచ్చిందో తెలుసా...?'

'తెలీదు'

'మూడు రోజుల క్రితం కార్పొరేట్ కాన్వెంట్‌లో చదివే ఒక అబ్బాయి ఈ మొక్కను నాటి ఫొటోలు తీసుకొని వెళ్ళాడు. ఆ తర్వాత ఆ అబ్బాయి ఇటువైపు రానేలేదు.'

'అయితే, ఏమిటి?' అడిగింది మరోకాకి.

'ఆ రోజు ఆ అబ్బాయి నీరు కూడా పూర్తిగా పోయనేలేదు. ఫొటో తీయగానే ఆ కడవ అలాగే ఉంచి వెళ్ళిపోయాడు. ఆ మొక్క బాగా వాడి పోయింది. ఇంకొక్క రోజు ఆగితే ఆ మొక్క చనిపోతుంది. అందుకే కడవలోని నీట్లో గులక రాళ్ల వెయ్యగానే నీరు పొర్లి, మొక్కకు చేరింది. అది బతికి పెద్ద చెట్టు అవుతుంది.' అంది.

'మరి ఆ రాళ్ల మళ్లీ ఎందుకు తీశావు?' అనడిగింది రామచిలుక.

'ఒకవేళ వర్షం పడితే- కుండలో పడి, పొర్లిపోకుండా ఉండటానికి కొంచెం ఖాళీ చేశాను. మొక్కకు అవసరమైనప్పుడు మళ్లీ గులకరాళ్లు వేస్తాను.' అని వివరించింది కాకి.

'భలే భలే... నీ బుర్ర తెలివైనది. నీ మనసు అంతకన్నా గొప్పది.' అని మెచ్చుకున్నాయి మిగతా పక్షులు.

- ఓట్ర ప్రకాశరావు
09787446026

# పొద్దు తిరుగుడు పువ్వు

సైన్స్ కథ

అందమైన తన గ్రామం అంటే ప్రజ్ఞకు ఎంతో ఇష్టం. అందమైన పెద్ద పెద్ద చెట్లతో పచ్చిక బైళ్ళు, పచ్చని పొలాలు, గలగల పారే పంట కాలువలు చేసే చిరుసవ్వడి.. వాటిపై అవతలి గట్టుకు దాటటానికి కుపయోగించే తాటి దుంగలూ, పక్షుల కిలకిలారావాలు, ప్రేమతో పలకరించే గ్రామస్తులు, ఎంత మంచి అనుభూతులో గ్రామాల్లో !! మనుషులే కాదు..! పక్షులు, మొక్కలూ కూడా మనతో సాహచర్యం చేస్తున్నాయేమో అనిపిస్తుంది. తమ కూతతో జవాబిచ్చే కోకిలలు, చెరువు గట్టున నుంచుంటే చాలు కాళ్ళవరకూ వచ్చి పలకరించే చిన్న చిన్న చేపలు, చెరువు మధ్యలో ఆహ్లాదకరమైన తామర పువ్వులు, బడికెళ్ళే దారిలో పక్క నుంచి పరుగెత్తే ఉడతలూ, అందమైన సీతాకోకచిలుకలూ, వాటిని చూస్తూ రోజూ బడికి వెళ్ళటం అంటే ప్రజ్ఞకు ఎంతో ఇష్టం. తను ప్రతిరోజూ బడికి వెళ్ళే ఆ దారిలో తనకు ఆశ్చర్యం కలిగించే విషయం ఒకటుంది. అదే పొద్దుతిరుగుడు చేను. విచిత్రంగా దాని పువ్వులన్నీ తను బడికి వెళ్ళేటప్పుడు.. బడినుంచి తిరిగి వచ్చేటప్పుడు తన వైపే తిరిగి తననే చూస్తుండటం... ఈ విషయం తను రెండో తరగతి లోనే గమనించింది. ఆ పూలు తన వైపుకి తిరిగి చూడటం మొదట్లో కొంత భయపెట్టినా మొక్కలే కదా! అన్న ధైర్యం కొంత భయాన్ని దూరం చేసినా, ఐదో తరగతి వరకు ఒంటరిగా మాత్రం బడికి వెళ్ళేది కాదు ప్రజ్ఞ. మూడో తరగతిలో ఒకసారి తను రంగయ్య తాతతో అదే దారిలో ప్రతి ఆదివారం జరిగే సంతకు వెళు తుండగా. పూలు తనవైపు చూడటం గురించి అడిగింది. రంగయ్య తాత పెద్దగా నవ్వి 'పువ్వులు నీవైపు కాదమ్మా చూసేది. అవి సూర్యుడి వైపు చూస్తున్నాయి చూడు' అంటూ చెప్పటం ముగించాడు. నిజమే తను సరిగ్గా గమనించలేదు గాని నిజంగానే పువ్వులు సూర్యుని వైపు తిరిగున్నాయి. తాత చెప్పిన మాటలకు విషయం తెలుసుకున్న తను, 'అవి సూర్యుని వైపు ఎందుకు తిరుగుతున్నాయి తాతా!' అని అడిగింది. అందుకు తాత 'నాకు తెలియదురా.. భగవంతుని సృష్టిలో ఇలాంటివి చాలా జరుగుతాయి' అన్నాడు పైకి చూస్తూ. ఇప్పుడు తను అదే దారిలో నడుస్తుంది తన తమ్ముడితో... ఆ చేను వచ్చేసరికి మళ్లీ అదే ప్రశ్న. తాత చెప్పిన సమాధానంతో తృప్తి చెందని తన ఆలోచన మళ్ళీ ప్రశ్న రూపంలో తన మనసులో మెదిలింది. ఇప్పుడు తను మామయ్యని రిసీవ్ చేసుకునేందుకు బస్టాప్‌కు వెళుతోంది. అమ్మ చెప్పింది.. మామయ్య బాగా చదువుకొని ఇప్పుడు కాలేజీలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడని. మామయ్య ఎంత మంచి వాడో! చక్కగా అడిగిన ప్రశ్నలన్నింటికీ అర్థమయ్యే విధంగా సమాధానాన్ని చెప్పే మామయ్య అంటే ప్రజ్ఞకు అంతులేని అభిమానం. తను బస్టాండు దగ్గరకు చేరేసరికే మామయ్య బస్సు దిగి ఎదురుచూస్తున్నాడు. గబగబా ఆయన దగ్గరికి వెళ్లి అతని చేతిలో బ్యాగు అందుకునే ప్రయత్నం చేసారు కానీ, మామయ్య 'బరువుగా ఉందిరా! బ్యాగ్.. మీరు మోయలేరు' అంటూ ఇంటికి నడక సాగించాడు.

తనతో పాటు నడుస్తూ మాటల్లో పడ్డారు ముగ్గురూ. చేను రానేవచ్చింది. ఇంకేముంది తన ప్రశ్నలను ఏకరువు పెట్టింది ప్రజ్ఞ. చిన్న గా నవ్వుతూ ప్రకృతిని గమనించే స్వభావాన్ని మనస్సులో మెచ్చుకొంటూ 'చూడు ప్రజ్ఞ! తాత చెప్పిన విధంగానే పువ్వులు సూర్యుడు వైపు తిరుగుతాయి. దానినే ఫొటోట్రాఫిజం అంటారు.. తెలిసిందా?' అన్నాడు మామయ్య. 'ఫొటోట్రాఫిజం అంటే ఏమిటి మామయ్యా? దాని కారణంగా పువ్వులు ఎలా సూర్యుడు వైపు తిరుగుతాయి?' అడిగింది. పూర్తిగా విషయాన్ని తెలుసుకొనేదాకా విశ్రమించదని ప్రజ్ఞ గురించి తెలిసిన మామయ్య వివరంగా చెప్పటం మొదలు పెట్టాడు. 'చూడు ప్రజ్ఞా! దీనికి ప్రధాన కారణం ఆక్సిన్ అనబడే ఒక వృద్ధి నియంత్రక హార్మోన్. ఇది కణజాలం త్వరగా పెరిగే విధంగా చేసి మొక్క ఎదగటానికి సహాయపడుతుంది.' చెప్పాడు. 'మామయ్యా పొడవు ఎదగటం సరే! మరి పువ్వులు ఎందుకు సూర్యుని వైపు తిరుగుతున్నాయో చెప్పవా ప్లీజ్'? 'మంచి ప్రశ్న వేశావురా... ఇందాక నే చెప్పానే ఆక్సిన్ అనే వృద్ధి నియంత్రక హార్మోన్ గురించి. అది కాంతి పడే ప్రదేశం నుంచి దూరంగా జరిగి కాంతి పడని ప్రదేశానికి చేరుకుంటుంది. అక్కడ కణజాలం త్వరగా పెంచుతుంది. అందువల్ల దానికి వ్యతిరేకత ప్రదేశంలో తక్కువ కణజాలం ఉండటంవల్ల పువ్వులు ఆ వైపు వంగుతాయి. ఇంకా వివరంగా చెప్పాలంటే, ఉదయం పూట సూర్య కిరణాలు తూర్పు నుంచి మొక్కపై పడతాయి. అప్పుడు ఈ హార్మోన్ కాంతికి వ్యతిరేక దిశగా అంటే కాడ పడమర వైపుకి ప్రయాణించి.. ఎండ పడని కాడ భాగానికి చేరుకుంటుంది, అక్కడ అది అధికంగా కణజాలం అభివృద్ధి చెందిస్తుంది. దాని కారణంగా తక్కువ కణజాలం ఉన్న తూర్పు వైపు పువ్వులు నెట్టబడటం వల్లనే పువ్వులు సూర్యకాంతి వైపు తిరుగుతాయి. అర్థమయిందా? అర్థం అయ్యీ, కానట్లు తలవూపిన ప్రజ్ఞను చూసిన వాళ్ళ మామయ్యకర్థమైపోయింది, తన సందేహం ఇంకా తీరలేదని. కొంచెంసేపు ఆలోచించిన తనకు తట్టిన ఆలోచనతో ప్రజ్ఞకు సమాధానం చెప్పటం మొదలుపెట్టాడు. 'చూడు.. మన ఊరిలో నారమ్మ మామ్మ తెలుసు కదా? ఆవిడ ఎలా నడుస్తుంది?' 'తెలుసు మామయ్య, బాగా ముందుకు వంగిపోయి నడుస్తుంది. తన వీపుపై ఎందుకో ఒక మూపురంలాగా కూడా ఉంటుంది. తనకు గూనంట అమ్మ చెప్పింది. నాతో తను మాట్లాడాలంటే పూర్తిగా తల తిప్పి నా వైపు చూస్తూ మాట్లాడుతుంది'. 'ఊ... బాగా గమనించావు. తను ఎందుకలా ముందుకు వంగి నడుస్తున్నదో నీకిప్పుడు చెబుతాను శ్రద్ధగా విను. వీపున కణజాలం బాగా పెరిగిపోవటం వల్ల తక్కువగా పెరిగిన ముందు వైపుకు భాగంవైపు నెట్టబడటంవల్లే కాక కొంత వెన్నెముకలో లోపంవల్ల కూడా తను అలా ముందుకు వంగి నడుస్తోంది అర్థమైందా? వెలిగిపోతున్న ప్రజ్ఞ ముఖం చూస్తేనే అర్థమవుతుంది తనకు పూర్తిగా అర్థం అయిపోయిందని. అంతలో నర్సయ్యతాత ఎదురుగా వచ్చి వీళ్ళిద్దర్ని పలకరించాడు. తాత పెద్ద బానపొట్ట చూసేసరికి ప్రజ్ఞకు అర్థం అయిపోయింది తనెందుకు కొంచెం వెనక్కు వంగి నడుస్తున్నాడో? అంతలో మామయ్య సెల్ఫోన్ మ్రోగింది. 'వచ్చేస్తున్నాం బావగారూ.. ఇంటికి దగ్గరలోనే ఉన్నాం..' అనే సమాధానం చెప్పాడు. దారిలో కలసిన స్నేహితులు, బంధువులను పలకరించుకుంటూ ఇంటికి చేరుకున్నారు.

- సుంద్రు శ్రీనివాసరావు
94945 32570



బుజ్జాయిలూ! ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి కింద బాక్సులు ఉన్నాయి. బొమ్మలను లెక్కించి, ఆ సంఖ్యను బాక్సుల్లో రాసేయండి.

పిల్లలూ! ఇక్కడున్న నీమో చేప ... తన ఇంటిని చేరుకోడానికి ప్రయత్నిస్తుంది. కానీ, ఎలా చేరుకోవాలో దానికి తెలియడం లేదంట! మీరే దారి చూపించే సాయం చేయండి.



చిన్నారులూ! ఇక్కడ పక్క వరుసలో కొన్ని బొమ్మలు, వాటికి పక్కనే వాటి నీడలూ ఉన్నాయి. ఏ బొమ్మ నీడ ఏదో గుర్తించి జతచేయండి.

బుడుగులూ! ఇక్కడ కొన్ని జంతువుల ఒకవైపు తలలు, మరోవైపు తోకలు ఇచ్చాం. అయితే, బాగా గమనించి ఏ జంతువు తోకను ఆ జంతువుకు జతచేయండి

పిడుగులూ! ఈ రెండు బొమ్మల మధ్య ఐదు తేడాలు ఉన్నాయి. అవెక్కడున్నాయో గుర్తించి సున్నా చుట్టేయండి.



కొత్త పుస్తకాలు

## మదిని దోచే మెరుపులు




పుస్తకం : వడిచర్ల మణిపూసలు
రచన : వడిచర్ల సత్యం
పేజీలు : 108, ధర : 75/-
ప్రతులకు : వడిచర్ల సత్యం
ఇం.నెం. 2-2-87/29, సాయినగర్,
సాయిపూర్ తాండూర్,
వికారాబాద్ జిల్లా - 501141
సెల్ : 9441350137

మణిపూసలనేది ఒక నూతన కవితా ప్రక్రియ. దీని సృష్టికర్త వడిచర్ల సత్యం. అతి తక్కువకాలంలోనే బహుళ ప్రాచుర్యం పొందిన లఘు గేయ కవితా ప్రక్రియ ఇది. నాలుగు పాదాలను కలిగి మాత్రా ఛందస్సుతో, అంత్యానుప్రాసలు కలిగి లయబద్ధంగా ఉంటూ... వింటూ ఉంటే ఓ పాటలాగా కవి హృదయాలను హత్తుకుంటాయి. ఈ ప్రక్రియలో వడిచర్ల సత్యం ప్రచురించిన పదో పుస్తకం ఇది. 'వడిచర్ల మణిపూసలు' అనే ఈ సంపుటిలో 361 గేయాలు ఉన్నాయి.

అక్షరాంబ పాదాలకు/ అమ్మ నాన్న పాదాలకు/ ఆచార్యుల పాదాలకు/ వందనాలు వందనాలు. ఇదొక మణిపూస. చాలా సులభరీతిలో అనంతమైన భావాన్ని అందంగా చెప్పారు. నీళ్ళు నిండినట్టి చెరువు/ ఊరికదియే కల్పతరువు/ సస్యలక్ష్మి నవ్వులు విని/ పారిపోవునంత కరువు.. ఏ గ్రామమైనా సుభిక్షంగా ఉండాలంటే అక్కడి చెరువు నిండుగా ఉండాలి. అప్పుడే కదా గ్రామం పచ్చదనాల పొదరిల్లయేది. జ్ఞాననిధి పుస్తకము/ బుధులమది పుస్తకము/ విశ్వమంత ప్రవహించెడి/ కాంతినది పుస్తకము.. పుస్తకానికున్న విలువను చెప్పే మణిపూస ఇది.

శ్రామికుల గురించి, శ్రమదోపిడీ గురించి చెప్పిన బుల్లి గేయం చూడండి : ధనవంతులు కొందరు/ గుణవంతులు కొందరు/ కష్టజీవి చెమటలను/ దోయనోళ్ళు ఎందరు?.. అలాగే- ఒప్పు జరిగితే నాది/ తప్పు జరిగితే నీది/ ఇట్లాంటి మాటలే/ కొట్లాటకు పునాది.. కవి మాట అక్షర సత్యం కదా! హామీలు ఇవ్వడము/ గెలిచాక నవ్వడము/ ఓట్లేసిన వాళ్ళందరు/ ఏదేండ్లు ఏడ్వడము.. మన ప్రజాప్రతినిధుల తీరుకు సున్నితమైన చురక ఇది. ఇలా ఇందులో ఉన్న ప్రతి మణిపూస నిజంగా మణిపూసల్లాగే మెరుస్తూ మంచి సందేశాన్నిస్తున్నాయి. శ్రీపద అనే కలం పేరుతో రచనలు చేసే సత్యం వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. తన రచనలన్నీ సామాజిక అంశాలతో ముడిపడి ఉన్నాయి.

- శాంతికృష్ణ

## వాస్తవ కథనాల 'కొత్త నీరొచ్చింది'




పుస్తకం : కొత్త నీరొచ్చింది
రచయిత : అంపశయ్య నవీన్
పేజీలు : 167, ధర : 200
ప్రతులకు :
నవోదయ : 040 - 24652387
నవచేతన : 040 - 24224458
రచయిత నెం : 9989291299

ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ ఇప్పటికే ఆరు కథా సంకలనాలు కూడా తీసుకొచ్చారు. ఆయన తాజా కథాసంకలనం 'కొత్తనీరొచ్చింది.' కథారచనపై రచయిత ఇష్టానికి, విరామమెరగని కొనసాగింపునకు కొత్త సాక్ష్యం ఈ కథలు. ప్రముఖ చిత్రకారుడు రమణజీవి గీచిన అట్టమీద బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఏడవ కథా సంకలనంలోని 15 కథలూ రచయిత తన సొంత, పరిచిత అనుభవాల నుంచే ఎక్కువగా రాశారు. ఇందులోని కథలన్నీ ఆయా కాలమాన పరిస్థితుల్ని మన కళ్ల ముందుంచుతాయి. రచయిత తను చూసిన, తనకు ఎదురైన, మిత్రులు చెప్పిన సంఘటనలనే ఇతివృత్తాలుగా ఈ కథలను ఆసాంతం నడిపించారు. ఎక్కువ కథలు వ్యవస్థలో జరిగే కొన్ని ప్రత్యేకమైన స్త్రీ-పురుష సంబంధాలను ప్రతిబింబించేలా ఉన్నాయి. రచయిత ప్రతి కథలోనూ వాస్తవిక పరిస్థితిని ఉన్నదున్నట్లే చెప్పదలిచినట్లు అనిపించింది. టైటిల్ కథ 'కొత్తనీరొచ్చింది' కథ నోట్ల రద్దు తర్వాత పరిణామాలను ప్రతిబింబించేది. రెండువేల నోటుతో సామాన్యుల అవస్థపడిన తీరును కళ్లకు కట్టారు. ప్రతి కథలో ఆయన పాత్రధారి కావడం జరిగింది. ఆయన ఏ కథలోనూ ఎవరినీ తప్పుపట్టకుండా, ఎవరినీ సమర్ధించకుండా సౌకర్యంగా కథలన్నీ రాశారు. 'పునిస్త్రీ' కథలో ఆ ఇంటావిడ వేరొకరితో ఉన్న అనుబంధం గురించి చెప్పిన తీరు, కథలోని కాలమాన పరిస్థితులు ఇప్పటివి కాదు. ఆ కథ వంశీ ప్రచురణల 'కొత్త కథ 2018' కథాసంకలనంలో ప్రచురితమైంది. 'థాంక్యూ మిస్టర్ రావ్' కథ 'ప్రభవ' మాసపత్రికలో 1979లో ప్రచురితమైంది. కానీ, కథాంశం నేటి పరిస్థితులను ప్రతిబింబిస్తోంది. ఈ వైవిధ్యం కథల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 'పెద్దకథలు రాసే పద్ధతి నుంచి జీవితంలోని అన్ని పార్శ్వాలను స్పృశించే చిన్న కథలు రచించే పద్ధతికి వచ్చారు. ఆవిధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వారి జీవితాల్లోని అన్ని కోణాలను ఇతివృత్తంగా గ్రహించారు' అని నవీన్ గారి గురించి కె.పి.అశోక్‌కుమార్ తన వెనకమాటలో ప్రస్తావించింది అక్షర సత్యం.

- శాంతిశ్రీ

పుస్తకం : సామాజిక నానీలు
రచన : ఎస్.ఎం. సుభాని
పేజీలు : 40, ధర : 60/-
ప్రతులకు : షేక్ సల్మా బేగం,
8-3-248/బి, 6వ లైను,
బుచ్చయ్య తోట,
గుంటూరు : 522001




పుస్తకం : అంతరంగం (కవిత్వం)
రచన : బగ్గాం స్పందన
పేజీలు : 55, ధర : 100/-
ప్రతులకు : డా. స్పందన బగ్గాం
శశి కుమార్, 57-4-8/1, దుర్గా నగర్,
కంచరపాలెం,విశాఖపట్నం-530008
సెల్ : 919490461596



### హో నో.....

**భర్త :** పెరుగన్నం అన్నావు కదా! మరి దీనిలో అసలు పెరుగే కనబడడం లేదేంటి?

**భార్య :** నస పెట్టకుండా తినండి.. హైదరాబాద్ బిర్యానీలో మీకు హైదరాబాద్ ఉంటదేంటి

**భర్త :** నాకు బెండకాయ అంటే ఇష్టం లేదని తెలిసినా కూడా ఇన్ని వెరైటీ బెండకాయ ఐటమ్స్ చేసావెందుకు?

**భార్య :** అవునా...మీకు బెండకాయంటే ఇష్టం లేదా...?

**భర్త :** అదేంటి అలా అడుగుతున్నావ్.. నీకు తెలుసుగా..

**భార్య:** మరి సరళ అనే మీ ఫ్రెండ్ బెండకాయ కూర ఫొటో అప్లోడ్ చేస్తే... వావ్ నోట్లో నీళ్లూరుతున్నాయని చెప్పారుగా.. ఇప్పుడు తినండి నోట్లో నీళ్ళు ఎలా రావో చూస్తాను..

### అవునా ...

**బావమరిది :** నిన్న రాత్రి కరెంట్ పోవడం వలన నేను రెండుగంటలపాటు లిఫ్ట్‌లో ఉండిపోవాల్సి వచ్చింది.

**బావ :** నా బాధ ముందు నీ బాధ ఎంతరా..? నేనైతే కరెంట్ లేక నాలుగు గంటలు ఎస్కలేటర్ మీదే ఉండిపోయా...!

లీగల్ కాలమ్

## ఏది దారిద్ర్య రేఖ?

**భారతదేశంలో** దారిద్ర్యరేఖ కింద జీవిస్తున్న వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతుంది. ఆచరణలో ఇవి రాజకీయ లబ్ధికోసమే దుర్వినియోగమౌతున్నాయనే విమర్శ ఉంది.

ప్రతి ఏటా ప్రభుత్వం దారిద్ర్యరేఖ దిగువ గలవారి సంఖ్యను ప్రకటిస్తుంది. అయితే, ఇవి వాస్తవ సంఖ్య కన్నా తక్కువగా ఉంటున్నాయని విమర్శలున్నాయి. సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాలంటే కనీసం దాదాపుగానైనా సంఖ్య వివరాలుండాలి. అయితే, ఈ సంఖ్యలు కాకిలెక్కలు కాకూడదు. అప్పుడు పథకాలన్ని ప్రచారం కోసం చేసేవిగాను మభ్యపెట్టేవిగాను కంటితుడుపుగాను తయారవుతాయి వాటివల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదు.

**కేసువివరాలు :** పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీ సంస్థ సీనియర్ లాయర్ గొన్ సాల్వెజ్ ద్వారా సుప్రీం కోర్టులో ఒక పిటీషన్ వేసింది. అందులో 2000లో ప్రభుత్వ లెక్కల ప్రకారం దారిద్ర్యరేఖ దిగువ కుటుంబాలు 652 లక్షలు ఉండగా, అది 2010కి 859 లక్షలకు పెరిగింది. కేంద్రంలో మనదేశ జనాభాలో కేవలం 27 శాతం దారిద్ర్యరేఖ దిగువ ఉన్నారని లెక్కలు వేస్తోంది. అయితే, ప్రభుత్వం నియమించిన జస్టిస్ వాధవా కమిటీ 36 శాతం మంది దారిద్ర్యరేఖ దిగువున ఉన్నారని నిర్ధారించింది. దీనివల్ల కేంద్రం నుంచి ఆహారధాన్యాలు 2.5 మిలియన్ టన్నులు మాత్రమే రావడం వల్ల అవసరాలకు చాలటం లేదు. దీనిని వాస్తవ సంఖ్యలకు అనుగుణంగా పెంచాల్సిన అవసరం ఉంది. కేరళ రాష్ట్రం దారిద్ర్యరేఖకు దిగువున గల కుటుంబాల అంచనా శాస్త్రీయంగా చేయడం వల్ల అక్కడి సంఖ్య కరక్టుగా ఉంది. మిగతా రాష్ట్రాల్లో అలా లేదు. కనీసం జస్టిస్ వాధవా కమిషను లెక్కలు అనుసరించి అయిన ఆహారధాన్యాలు పంపిణీ చేయాలని పిటీషనర్లు అర్థించారు.

కేసును విచారించిన జస్టిస్ భండారీ, జస్టిస్ దీపక్‌వర్మ ప్రభుత్వాన్ని అనేక వివరాలు అడిగి తెలుసుకున్నాక కేంద్రం రాష్ట్రాలకు వారి వారి అవసరాలు దృష్టిలో ఉంచుకుని ఆహార ధాన్యాలు విడుదల పెంచాలని తద్వారా నిల్వలకు తగిన ఏర్పాట్లు చేసుకోవచ్చని తెలియజేసింది.

గతకాలం వానలు వరదలు బీభత్సం వల్ల కోట్లాది రూపాయల ఆహార ధాన్యాలు నిరుపయోగంగా మారిన విషయం కోర్టు దృష్టిలో ఉంచుకుంది.

**- కాటూరి రవీంద్ర త్రివిక్రమ్,**
న్యాయ నిపుణులు

## ప ద వి కా సం 149

కూర్పు : రావెళ్ల

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ✿ | 3 | 4 | | 5 |
| | ✿ | | ✿ | 6 | ✿ | | ✿ | |
| 7 | | ✿ | 8 | | | ✿ | 9 | |
| | ✿ | 10 | ✿ | | ✿ | 11 | ✿ | |
| ✿ | 12 | | | ✿ | 13 | | | ✿ |
| 14 | ✿ | | ✿ | 15 | ✿ | | ✿ | 16 |
| 17 | | ✿ | 18 | | | ✿ | 19 | |
| | ✿ | 20 | ✿ | | ✿ | 21 | ✿ | |
| 22 | | | | ✿ | 23 | | | |

### అడ్డం ఆధారాలు

1. తొందరపాటు (4)
3. విను (4)
7. కాపలా (2)
8. గాలిపటం (3)
9. పక్షి రెక్కలో భాగం (2)
12. మనసు (3)
13. బాధ (3)
17. వార్త తెచ్చేవాడు (2)
18. ఆహ్వానించు (3)
19. నేత పనివాళ్ల పనిముట్టు (2)
22. ఏరు సముద్రంలో కలిసేచోటు (4)
23. నడిరేయి (4)

### నిలువు

1. కొత్తదైన (4)
2. గుట్టు, రహస్యం (2)
4. లాభం (2)
5. తేలిక (4)
6. వ్యవహారం (3)
10. ఆరంభం (3)
11. వంద పద్యాల పుస్తకం (3)
14. యాతన మరోవిధంగా (4)
15. హానికర పదార్థాల వల్ల గాలి, నీరు కలుషితంకావటం (3)
16. దవాఖానా (4)
20. వ్యాయామం (2)
21. సగం (2)

### గతవారం జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఎం | డి | 2 పో | వు | ✿ | 3 ఆ | 4 ప | న్ను | 5 డు |
| ద్ర | ✿ | వు | ✿ | 6 వా | ✿ | ఖ్యం | ✿ | లా |
| 7 కా | య | ✿ | 8 వా | ర | ట | ✿ | 9 పో | గు |
| య | ✿ | 10 పొ | ✿ | ధి | ✿ | 11 అ | ✿ | లా |
| ✿ | 12 పొ | దు | చు | ✿ | 13 ర | క్ష | ణ | ✿ |
| 14 దో | ✿ | గు | ✿ | 15 మం | ✿ | య | ✿ | 16 ఫీం |
| 17 మ | తి | ✿ | 18 మం | గ | లం | ✿ | 19 మే | క |
| తె | ✿ | 20 కా | ✿ | ళం | ✿ | 21 చే | ✿ | రిం |
| 22 ర | 21 క్త | దా | నం | ✿ | 23 మం | ద | లిం | పు |

### సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | | | | | 5 | | | |
| | 6 | | | | | 5 | 9 | |
| 5 | 9 | 4 | 3 | | | | 7 | |
| | 3 | 2 | | 5 | | 7 | | |
| 4 | | | | 8 | | | | 9 |
| | | 7 | | 3 | | 6 | 5 | |
| | 5 | | | | 7 | 9 | 6 | 4 |
| | 4 | 9 | | | | | 8 | |
| | | | 9 | | | | | 5 |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 6 | 3 | 2 | 7 | 8 | 5 | 9 | 1 |
| 2 | 5 | 1 | 4 | 3 | 9 | 8 | 7 | 6 |
| 8 | 9 | 7 | 1 | 6 | 5 | 4 | 3 | 2 |
| 1 | 7 | 2 | 9 | 8 | 6 | 3 | 5 | 4 |
| 6 | 4 | 9 | 5 | 2 | 3 | 1 | 8 | 7 |
| 3 | 8 | 5 | 7 | 4 | 1 | 6 | 2 | 9 |
| 9 | 3 | 4 | 6 | 5 | 7 | 2 | 1 | 8 |
| 7 | 2 | 8 | 3 | 1 | 4 | 9 | 6 | 5 |
| 5 | 1 | 6 | 8 | 9 | 2 | 7 | 4 | 3 |

### లెక్కించండి

| | | | | |
|---|---|---|---|---|
| 7 | + | | = | 11 |
| + | ■ | + | ■ | + |
| 1 | + | | = | 10 |
| = | ■ | = | ■ | = |
| | + | | = | |

1 పజిల్




2 పజిల్

ఈ పజిల్స్‌కి జవాబులు వచ్చేవారంలో ....

### గతవారం జవాబులు

1 పజిల్‌కు సమాధానం

మొదటి వరుసలో 11, మూడవ వరుసలో 11, చివరి వరుసలో ఒక గడిలో 11, 11 చివరి గడిలో (22)

2 పజిల్‌కు సమాధానం (741/2)

# ఆలూ వెల్లుల్లి కూర

**కావల్సినవి:**

వెల్లుల్లి గడ్డలు రెండు (పాయలుగా విడగొట్టుకోండి కాని ఒలవొద్దు). ఉప్పు లేని వెన్న అరకప్పు, ఆలుగడ్డలు ఒకటింబావు కేజీ, పాలు ముప్పావు కప్పు, ఉప్పు కొద్దిగా తెల్ల మిరియాల పొడి.

**తయారీ :**

ఒక గిన్నెలో నీళ్ళు పెట్టి కాగాక వెల్లుల్లిపాయలు వేసి రెండు నిమిషాలు ఉడికించి తీసేసి ఒలిచి పెట్టుకోండి. మందపాటి కడాయిలో సగం వెన్న వేసి సన్న సెగ మీద కరిగించి వెల్లుల్లిపాయలు వేసి మూతపెట్టి 20-25 నిమిషాల సేపు ఉడకనివ్వండి. బాగా మెత్తగా అయి బంగారు రంగుకి వచ్చాక దించండి. మాడకుండా జాగ్రత్త పడండి. దీన్ని మిక్సీలో వేసి మెత్తగా నూరుకుని పక్కన ఉంచుకోండి. ఈ లోగా ఆలుగడ్డల తొక్కు తీసి నాలుగు ముక్కలుగా చేసుకుని నీళ్ళు పోసి పొయ్యి మీద పెట్టండి. ఉప్పు కూడా వేసి పెద్ద మంట మీద ఉడకనివ్వండి. ఉడికాక మంట తగ్గించి చెక్క స్పూన్‌తో మెత్తగా చేసుకోండి. తర్వాత పాలు వేడిచేసి దించి దాంట్లో వెన్న, వెల్లుల్లి ముద్ద కలిపి ఈ మిశ్రమాన్ని ఆలుముద్దలో కొద్ది కొద్దిగా పోస్తూ కలపండి. కావాలంటే తిరగమోత కూడా వేసుకోవచ్చు. చాలా రుచిగా ఉంటుంది ఈ వంటకం.

## రుచి

ఈ రోజుల్లో బంగాళాదుంప లేకుండా కూరగాయలను ఊహించుకోలేము. పిల్లలు ఎంతో ఇష్టపడి తినే బంగాళాదుంప చిప్స్, మనం నచ్చి మెచ్చి తినే బంగాళదుంప వెరైటీలు మనకు తెలిసినవే! అయితే ఈ వారం రుచిలో బంగాళాదుంపకు సంబంధించిన పోషక విలువల గురించి తెలుసుకుందాం.

| | | |
|---|---|---|
| కార్బొహైడ్రేట్ | 5% | 17 mg |
| కాల్షియం | 2% | 20 mg |
| కొలెస్ట్రాల్ | 0 % | 0 mg |
| సోడియం | 0% | 0 mg |
| పొటాషియమ్ | 12% | 421 mg |
| ప్రొటీన్ | 4% | 2 mg |

(ప్రతి 2000 కేలరీల డైట్‌కి...)

బంగాళదుంపలో పుష్కలంగా పిండి పదార్థం ఉండటం వల్ల రక్తంలో కొలెస్ట్రాల్‌ని చేరనివ్వదు. అందులో విటమిన్ సి, బి6 కలిసి ఉండటం వల్ల గుండెకు మేలు చేస్తుంది. వీటితోపాటు పొటాషియం, మెగ్నీషియం లభిస్తుంది. బంగాళదుంపను ఉడకబెట్టుకుని తింటే మేలు జరుగుతుంది. నూనెలో కానీ, నెయ్యిలో కానీ, ఫ్రై చేసుకుని తింటే కాస్తా లావు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

# పొటాటో రైస్

**కావల్సినవి :**

బంగాళదుంపలు : 2 (సన్నగా తరిగి పెట్టుకోవాలి), ఉల్లిపాయ : 1 (సన్నగా తరిగి పెట్టుకోవాలి) , టమోట : 1 (సన్నగా తరిగి పెట్టుకోవాలి), పచ్చిమిర్చి (సన్నగా తరిగి పెట్టుకోవాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్ : 1 స్పూను, ఉప్పు : రుచికి సరిపడా, మసాలాలు, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు (ఒక్కొక్కటి మూడు చొప్పున తీసుకోవాలి), ఎండుమిర్చి : 2, నీళ్లు : 2 కప్పులు, కొత్తిమీర : కొద్దిగా (గార్నిష్ కోసం)

**తయారీ :**

ముందుగా కుక్కర్‌లో కొద్దిగా నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడయ్యాక అందులో సన్నగా తరిగి పెట్టుకొన్న ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేగించుకోవాలి. తర్వాత అందులో అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కలుపుతూ ఫ్రై చేసుకోవాలి. ఇప్పుడు అందులోనే సన్నగా తరిగిన టమోట ముక్కలు పచ్చిమిర్చి ముక్కలు, మసాలా దినుసులు వేసి 10 నిమిషాలు ఫ్రై చేసుకోవాలి. ఇప్పుడు బంగాళదుంప ముక్కలు, ఎండుమిర్చి కూడా వేసి తక్కువ మంట మీద ఫ్రై చేసుకోవాలి. పోపు మొత్తం వేగిన తర్వాత అందులో కడిగిపెట్టుకొన్న బియ్యం, సరిపడా నీళ్ళు పోసి 4విజిల్స్ వచ్చే వరకూ మూత పెట్టి ఉడికించుకోవాలి. విజిల్ వచ్చిన తర్వాత స్టౌ ఆఫ్ చేసి ఆవిరి మొత్తం తగ్గిన తర్వాత మూత తీసి కొత్తిమీర తరుగును గార్నిష్ గా చిలకరించాలి .

# స్మార్ట్ రోబో

'వెర్వాట్' జర్మన్ యానిమేషన్ షార్ట్‌ఫిల్మ్... ఇంటిని శుభ్రం చేసే ఓ రోబోట్‌కు ఓ చిన్న ఏమరుపాటు వల్ల అనుకోని తిప్పలు ఎదురవుతాయి. శుభ్రం చేయాల్సిందల్లా ఇంటిని మురికి చేస్తుంది. యజమానులొచ్చేలోగా తన తెలివితో ఆ సమస్యకు ఏ పరిష్కారమిచ్చిందనేది ఈ కథలో ఆసక్తికరం. సరదాగాను ఆ చిట్టి రోబో మీద జాలిపడేలాను కథనం నడుస్తుంది. చివరకు రోబో తెలివికి మనమూ చప్పట్లు కొట్టేస్తాంలెండి. మూడే నిమిషాలున్న ఈ లఘుచిత్రాన్ని స్టెఫ్ఫెన్ కుడెరర్ తెరకెక్కించారు. ఫ్రాంక్ రోజెన్‌క్రాంజెర్, డేనియెల్ స్ప్రాఫెల్ సహాయాన్ని అందించారు. రాబోయే కాలంలో రోబోలే సేవకులుగా మన ఇళ్లల్లో ప్రవేశించనున్నారనేది... ఎప్పటినుంచో ఉన్న మాట. అయితే, ఇలాంటి స్మార్ట్ రోబోలయితే భలే ఉంటుంది కదండీ అనిపిస్తుంది.

సుచిత్రం

# పోరాటమే జీవితం

'స్పర్థ' తెలుగు లఘుచిత్రం... జీవితానికో లక్ష్యం ఉంటుంది. దాని దారిలో గెలుపోటములు ఎదురవుతాయి. వాటి మధ్య ఓ పెద్ద యుద్ధముంటుంది. పోరాటముంటుంది.. అదే ముఖ్యం... అదే జీవన సూత్రమనే ఉత్తేజకరమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. మొదటి నుంచి చివరి వరకు గుండె ఉప్పొంగేలా కథనాన్ని నడిపించారు. ఆలోచింపజేసే డైలాగ్‌లు, వాయిస్ ఓవర్, అత్యంత నాణ్యమైన సీజీవర్క్... రోమాలు నిక్కబొడుచుకునేలా చేసే నేపథ్య సంగీతం... అన్నీ హైలెటే ఈ చిత్రంలో. పరిస్థితులు, సంఘర్షణకు తలొగ్గి ఆత్మహత్య చేసుకోవాలన్న ఓ బాక్సర్ పాత్ర చుట్టూ తిరుగుతుంది కథ. దర్శకుడు, కథకుడు బిపన్

సుచిత్రం

నిరూప్ కుమార్‌కు హేట్సాఫ్ చెప్పాల్సిందే. పెద్దస్థాయి చిత్రాల సంగీతానికి పోటీగా బీజీఎం అందించిన బి.శ్రవణ్‌ని అభినందించాల్సిందే. కె.పర్వేజ్ ఫొటోగ్రఫీ, కుమార్ నిర్మల సృజన్ ఎడిటింగ్‌తో ఆకట్టుకున్నారు. ఇక ప్రధాన పాత్రలో నటిస్తూ చిత్రానికి బలాన్ని పెంచాడు శ్రీ. 20 నిమిషాల ఈ లఘుచిత్రం యూట్యూబ్ చానెల్ ఐఎంజె షార్ట్స్‌లో అందుబాటులో ఉంది.

# ఉర్రూతలూగించే ఫోక్

సంగీతికా..!

డీజే ఫోక్‌సాంగ్స్... ఉర్రూతలూగించే జానపద పాటలెన్నో ఇప్పుడు యూట్యూబ్ ఇతర ప్లాట్‌ఫామ్‌ల్లో అందుబాట్లోకి వచ్చాయి. వీటికి పది లక్షలకు పైగా వ్యూయర్‌షిప్ ఉంటోంది. 'నేనొస్తా బావ' అనే ఫోక్‌సాంగ్‌కు అయితే యూట్యూబ్‌లో దాదాపు 60 లక్షల వ్యూయర్‌షిప్ వచ్చింది. ఇవి ఒక్క కవర్‌సాంగ్‌లానో లేదా ఆల్బమ్ రూపంలోనో అందుబాటులో ఉన్నాయి. సుద్దాల అశోక్ రచనలో ఎస్పీ బాలు పాడిన 'నేలమ్మ నేలమ్మ' పాటకు విశేష ఆదరణ దక్కుతోంది. 'ఓ పిల్లో మౌనిక' అనే పాటకు 1 కోటీ 70 లక్షల వ్యూస్ వచ్చాయంటే వాటి క్రేజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 'రజిత' పాటకైతే దాదాపు 5 కోట్ల వ్యూస్ వచ్చాయి. వీటిలో ప్రత్యేకత ఏంటంటే... ఎక్కువగా డీజే మిక్స్‌తో ఉంటున్నాయి. వీటిలో స్థానిక యువత తమ టాలెంట్ నిరూపించుకుంటున్నారు. పెళ్లిళ్లు, బారాత్‌లు, ఊరేగింపులు ఇతర కార్యక్రమాల్లో ఈ పాటలన్నీ ఊపుఊపేస్తున్నాయి.



# పక్షుల ప్యాలెస్‌లు...!

ఒకప్పటి కోటలు, ప్యాలెస్‌ల నిర్మాణ రీతి మనల్ని సంభ్రమంలో పడేస్తుంది. గాలి, వెలుతురు అందించే కిటికీలు, ద్వారాలు,దీపస్తంభాలు, పోర్ట్‌కోలు... ఇలా ప్రతి దానినీ ఎంతో శ్రద్ధతో అద్భుతమైన కళావైచిత్రి విశేషాలతో అవి ఆశ్చర్యపరుస్తాయి. ఒక్కో దేశంలో ఒక్కో ఆర్కిటెక్చర్.. ఒక్కో ప్రత్యేకత. ఒట్టోమన్ సామ్రాజ్యంలోని కట్టడాల్లోనూ ఇలాంటి ఓ అరుదైన, మానవీయమైన ప్రత్యేకత కనిపిస్తుంది. పక్షుల కోసం ఆనాడు ప్యాలెస్‌లు, కోటలు, ఇతర కట్టడాల్లో చిన్నపాటి పక్షి గృహాల్ని ఏర్పాటు చేశారు. వాటి రూపం ప్యాలెస్‌లా కనిపిస్తుంది. ఈ బర్డ్ ప్యాలెసుల్లో పక్షులు సేద తీరేవి. ఆహారాన్ని నిల్వ చేసుకునేవి. ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పొందేవి. నీటి తావులు, ఆహార ఏర్పాట్లతో పాటు ఎండ తీవ్రత పడకుండా ఎంతో జాగ్రత్తగా వీటిని నిర్మించడంలోనే అప్పటి కళాకారుల శ్రద్ధ కళ్లకు కట్టేలా ఉంటుంది. వారి కళాత్మక నైపుణ్యాన్ని అభినందించకుండా ఉండలేం కదండీ..!







# సరీసృపాలు

అగ్గిపెట్టెల్లాంటి అపార్టుమెంటు గదుల్లో
తరగతికి అరవై దేహాలను కుక్కుతుంటే
మెదళ్ళులేని మేకల మందలా అరుస్తాయి తప్ప
ఆలోచనల రెక్కలతో సీతాకోక చిలకల్లా ఎగరలేవు
వడ్ల బస్తాల్లాంటి పుస్తకాల బ్యాగుల బరువును
విచ్చుకోని లేత మానులపై భారం మోపుతుంటే
వెన్నెముకలు విరిగ సరీసృపాల్లా పాకుతాయి తప్ప
ఆత్మవిశ్వాసంతో ఎగిరే జెండాల ఆకాశంపై చూడలేవు
బందిఖానాలను తలపించే హాస్టలు గదుల్లో
అలసిన శరీరాలకు మాదాకవళం పడేస్తుంటే
ఉరికొయ్యలకు వేళాడతాయి తప్ప
ఉత్సాహంతో ఉరకలెత్తే గాలిపటాల్లా పైకి ఎగరలేవు
ఆటపాటలతో ఆడుకోవాల్సిన వయసులో
పరిధికి మించిన పాఠాలను బుర్రలో కూరుతుంటే
మనసుల్లేని యంత్రాల్లా మసులుతుంటారు తప్ప
మానవత్వం పరిమళించే మంచి మనుషుల్లా
ఎదగలేరు

- ఈదర శ్రీనివాసరెడ్డి

9893111985

కవిత్వమ్

# అమ్మా, నేను ఒక 'టీ'

కళ్ళనీళ్ళు పెట్టిస్తే కాని
కట్టెల కడుపు మంట చల్లారదు
వాన ఎంత కుండపోతో
చెమ్మగిల్లిన కళ్ళను చూడాలి
నాలుగు గోడల మీద ఆన!
పలకా బలపంతోనే
ఎన్ని భావి చిత్రాలను
అందించినా అలసటేదీ?

గొంతు పూడిన పొగ గొట్టం
నల్ల మబ్బు కమ్మినట్లు
ఏది ఏమైనా
ఎసరు దిగాల్సిందే మరి
టీవరమ్మ అనగానే
అలసట కొండ దిగినట్లు

గుణింతాలు.. ఎక్కాలు
కిటికీలకు మైకులంత
చెవులు
బడి గంటకు ఉండే
క్రమశిక్షణ గురించి వేరే
చెప్పాలా
ఎన్ని తరాలను మోసుంటుంది!

ఛాయ్ వేడెక్కితే గాని
ఇంజను సెకను కదలదు
తాటిమట్టంత టీ కొట్టు
పొద్దు సంగతి దేవుడెరుగు
చిన్న చెంబు నింపాల్సిందే
లేదంటే తెల్లారదు
అమ్మ లేకున్నా అంతా
షరా మామూలే!

- పొదలకూరు మధుకుమార్

7780469234

# అజ్ఞాతవాసి



ఒకప్పుడతడు
గుడ్డిలోకానికి సిగ్గు దాచినవాడు
గుడ్డపేలికకు కొత్తనడక నేర్పినవాడు
చిన్నప్పుడు చొక్కా నిక్కరూ ఒకే గుడ్డతో కుట్టి
నన్ను దసరాబుల్లోణ్ణి చేసేవాడు
మిగిలిన ముక్కలన్నీ కలిపికుట్టి
రంగుల గాలిపటంలా నన్నెగరేసేవాడు
పండక్కి కొత్తబట్టలు కుట్టమనిస్తే
తీరిక లేదని తీరిగ్గా చెబుతూ
పాతబట్టలతోనే పండగని దేకించేవాడు
నాన్నిచ్చిన కొత్త బట్టలు
బీదాగొప్పా జాతివైరుధ్యాలు మరిచి
సమతాచిహ్నాల్లా చెట్టాపట్టాలేసుకుని
మళ్ళీ పండగదాక
అతని పాత దండెమ్మీద కళ్ళు మిటకరించేవి
ఎన్ని టమారాలు చేసినా
అతడెప్పుడు మా ఊరికిమిత్రుడే
పాతమిషన్ పాదం తొక్కుతూ
బతుకుగుర్రాన్ని
కొత్త పరుగు తీయించాలనుకునేవాడు
పరుగుల పాలు మాటెలావున్నా
గంపెడు సంసారాన్ని నిండుకుండలా
[illegible]
పంచభక్ష్యాలేమో గానీ
పట్టెడన్నాన్ని దర్జాగా కుట్టుకునేవాడు
ప్రతిష్ఠకు ప్రతీకై మెడలోని టేపు జీవిత ప్రమాణాల్ని
అంగుళాల లెక్కనే కొలిచిచూసేది
బాబిన్లో దారంలా మాటిమాటికి తెగిపోతూ
బండబారిన సూదిమొనలా బతుకు
వెక్కిరిస్తున్నప్పుడు
చేతిలోని కత్తెరతో లోకాన్ని ముక్కలుగా కత్తిరించి
కొత్త మోడళ్ళి కుట్టి
కాలందేహానికి వేలాడదీసేవాడు
ఒకప్పుడు ఫ్యాషన్ రంగానికి రాజైన
ఈ దర్జీమారాజు
ఇప్పుడు రెడీమేడ్ రంగడిదెబ్బకి
అదే రాజ్యంలో మారువేషంతో
బతుకీడుస్తున్న అజ్ఞాతవాసి
సమస్త ప్రాణికోటి నిద్రిస్తున్నప్పుడు
గత చరిత్ర గుట్టలకింద
నలిగిన వైభవాన్ని వెలికితీసి
దారిద్ర్యరేఖ రంగుమార్చేందుకు
చెవిలో పెన్సిల్తో అదే నల్లగీత గీస్తూ
నిరంతరం ప్రయత్నిస్తున్న నిత్యాన్వేషి!

- బంగార్రాజు కంఠ